




కార్తీకం..శివోహం

నేటి నుంచి కార్తీకమాసం - జిల్లాల్లో ఎన్నో శైవక్షేత్రాలు

అమలాపురం రూరల్/అంబాజీపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో చేసే స్నాన, జప, తప, దాన, వ్రతాదులు అనంతమైన పుణ్య ఫలాలు ఇస్తాయని భక్తుల ప్రగాఢ నమ్మకం.అందుకే ఈ మాసమంతా ఆధ్యాత్మికతే కనిపిస్తుంది. మాలధారణలు, సంప్రదాయాలు ఉట్టిపడతాయి. ఏ శైవ క్షేత్రానికి వెళ్లినా ఓం నమశ్శివాయ అనే శివపంచాక్షరీనామమే ప్రతిధ్వనిస్తుంది. శరదృతువులో వచ్చే కార్తీకమాసంలో చంద్రుడు కృత్తికా నక్షత్రంలో సంచరిస్తాడు కాబట్టి కార్తీక మాసమని పేరు వచ్చిం దని చెబు తుంటారు. కార్తీకమాసం శివకేశవులు ఇద్దరికీ ప్రీతిదాయకం.కార్తీకమాసంలో ఆలయాల సందర్శనకు ఆర్టీసీ ఆధ్వర్యంలో ప్రత్యేక బస్సు లు నడుపుతున్నారు.ఈ మాసంలో వనసమారాధనలు జరుగుతాయి.

ఆలయాలివిగో..

- ఈ మాసంలో తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం గోదావరి తీరం చాలా ప్రత్యేకం. తెల్లవారుజామునే మహిళా భక్తులు గోదావరిలో స్నానాలు ఆచరిస్తారు.నదిలో దీపాలు వదులుతారు. అక్కడే ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేస్తారు. గోదావరికి అటువైపున ఉన్న కొవ్వూరులోను తెల్లవారుజామున స్నానాలు, ఆచరిస్తారు.బిక్కవోలు, కొవ్వూరు, నిడదవోలు, ఉండ్రాజవరంలో కార్తీకమాసంలో దర్శించదగ్గ ఆలయాలున్నాయి. బిక్కవోలులో 1100 ఏళ్ల కిందటి గోలింగేశ్వరస్వామి ఆలయం, ఇళ్లపల్లిలోని 108 స్తం భాల గుడి, బలభద్రపురంలోని శివాలయంలో ద్వాదశ జ్యోతిర్లింగాలు చూడవచ్చు. ధవళేశ్వరంలో అగస్త్రేశ్వరుడు, రాజమహేంద్రవరంలో మార్కండేశ్వరుడు, ఉమా కోటిలింగేశ్వరస్వామి ఆలయాలు ఉన్నాయి.ఇటీవలే నిర్మించిన ఉజ్జయిని మహాకాలేశ్వరాలయం.
- కాకినాడ జిల్లాలోని దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పిఠాపురం పాదగయ క్షేత్రం కార్తీకానికి ముస్తాబైంది. సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయం, అన్నవరం సత్యదేవుడి ఆలయాల్లో ఏర్పాట్లు చేశారు.
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని కాట్రేనికోన మండలం కుండలేశ్వరం, ఐ.పోలవరం మండలం మురమళ్ల వీరేశ్వరస్వామి, అయినవిల్లి మండలం ముక్తేశ్వరస్వామి, కె.గంగవరం మండలం కోటిపల్లి, పంచారామల్లో ఒకటైన ద్రాక్షారామ, కొత్తపేట మండలం పలివెల కొప్పేశ్వరుడు,అంబాజీపేట మండలం వ్యాఘ్రేశ్వరంలోని వ్యాఘ్రేశ్వరస్వామితో పాటు ఏకా దశరుద్రులుగా పేరుగాంచిన 11 ఆలయాలు దర్శించుకుంటే పుణ్యఫలమని ప్రతీతి.

నేటి నుంచి ఆరంభం

ఈ ఏడాది కార్తీకం బుధవారం ప్రారంభమై వచ్చే నెల 20న ముగుస్తుంది. ఈ మాసంలో ప్రతిరోజూ ఓ పండుగే. నాలుగు సోమవారాలతోపాటు కార్తీకపౌర్ణమి ఎంతో విశిష్టమైనవి. అట్లతద్ది వాయినాలు తీర్చుకోలేని వారు సోమవారం పౌర్ణమి నాడు తీర్చుకుంటారు. ఈనెల 23న యమ విధియ. ఆ రోజున సోదరి ఇంట సోదరులు భోజనం చేసి కానుకలు ఇచ్చి రావాలి. 25న నాగులచవితి. పుట్టలో పాలుపోసి సుబ్రహ్మణ్యేశ్వరుని ఆరాధిస్తారు. 30న గోపాష్టమి, నవంబరు 2న చిలుక ద్వాదశిని పురస్కరించుకుని క్షీరాబ్ది పూజ చేస్తారు. 4న వైకుంఠ చతుర్దశి, 5న కార్తీక పౌర్ణమి, జ్వాలా తోరణం. 18న మాసశివరాత్రి, 21న పోలిస్వర్గం, పాడ్యమి దీపాలు విడిచిపెడతారు.

కాలిన..కాలుష్యం!



అమలాపురాన హై...

ఉమ్మడి జిల్లా మొత్తం మీద అమలాపురం పట్టణంలో గాలి నాణ్యత దారుణంగా పడిపోయింది. వాయుకాలుష్యం అత్యధికంగా ఇక్కడే నమోదైంది. పండగరోజు సోమవారం సాయం త్రం ఆరు గంటలకు ఏక్యూఐ 65 నుంచి ఏకంగా 138కి చేరింది. రాత్రి 7 గంటలకు 229, 8 గంటలకు 243, 9 గంటలకు 222, 10 గంటలకు 212, 11గంటలకు 198, అర్ధరాత్రి 12గంటలకు 164 నమోదైంది. తిరిగి మంగళవారం 11గంటల తర్వాత వాయు కాలుష్య తీవ్రత తగ్గిపోయి తిరిగి 56కి చేరింది.

రాజమండ్రిలో ఇలా..

రాజమహేంద్రవరంలోను వాయు కాలుష్యం భారీగా వెదజల్లింది. సోమవారం సాయంత్రం 5 గంటలకు ఏక్యూఐ 82గా నమోదైంది. 6 గంటలకు 121, 7గంటలకు 196, 8 గంటలకు 212, 9గంటలకు 199, 10 గంటలకు 197, 11గంటలకు 198, 12గంటలకు 164 చొప్పున నమోదైంది.మంగళవారం ఉదయం 10గంటల తర్వాత 62కి చేరింది.

కాకినాడలో కాస్త బెటర్

కాకినాడ నగరంలో సోమవారం సాయంత్రం 6 గంటలకు ఏక్యూఐ 156 ఉండగా, 7గంటలకు 174, 8గంటలకు 173, 9 గంటలకు 164, 10 గంటలకు 167, 11 గంటలకు 166, 12గంట లకు 151 నమోదైంది. అర్ధరాత్రి ఒంటిగంటకు 138, 2గంటలకు 103 నమోదవగా ఉదయం 8 గంటలకు తిరిగి 66కి చేరి గాలి నాణ్యత మెరుగైంది.

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

దీపావళి అంటే సందడే సందడి. బాణసంచా కాల్చి సంబరాలు చేసుకుంటారు.ఈ దీపావళి పండగకు ఉమ్మడి జిల్లాలో బాణ సంచా మోతమోగింది. జువ్వలు, బాంబులు, చిచ్చుబుడ్లు, లక్ష్మీ టపాసులు పేలాయి. రంగురంగుల మందుగుండు నిప్పులు చిమ్ముతూ పొగలుకక్కాయి. పండగ సంతోషంతో జనం ఎక్కడికక్కడ మందుగుండు భారీగా పేల్చారు. ఒక్కసారిగా పేలిన టపాసులతో గాల్లో కాలుష్యం తీవ్రత పెరిగింది. పొగ నిండిపోయి గాలి నాణ్యత దెబ్బతింది. ముఖ్యంగా సోమవా రం రాత్రి 7 గం టల నుంచి అర్ధరాత్రి 12 గం టల వరకు గాలి నాణ్యతను సూచించే ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ ఏకంగా రెడ్‌సిగ్నల్‌లోకి చేరింది. బాణ సంచావల్ల అత్యధిక కాలుష్యం అమలా పురంలో నమో దైంది.

పొగ 'మోతెక్కింది'

- హోరెత్తిన బాణసంచా పేలుడు
- ప్రమాదకర స్థాయికి చేరిక
- అమలాపురంలో ఏక్యూఐ 243
- రాజమహేంద్రవరంలో 212
- కాకినాడ నగరంలో 174
- 100 దాటితే శ్వాస ఆడదు

స్వచ్ఛమైన గాలి లేదు!

గాలిలో నాణ్యత సూచిక (ఏక్యూఐ) ఆధా రంగా కాలుష్య నియంత్రణ బోర్డు మార్గదర్శకాలు రూపొందించింది. ఏక్యూఐ సంఖ్య 50 పాయింట్లలోపు ఉంటే అక్కడ గాలి నాణ్యత బాగుం దని అర్థం. 50 నుంచి 100 వరకు ఉంటే మోడరేట్, 100 నుంచి 150 వరకు ఉంటే పూర్, 150 నుంచి 200మధ్య ఉంటే అన్‌హెల్తీ వాతా వరణం కింద భావించాలి. పండగ రోజు రాత్రి కాకినాడ, అమలాపురం, రాజమహేంద్రవరంలో వాయుకాలుష్య తీవ్రత పెరిగిపోయింది. ఏక్యూఐ 100 దాటితే ఆస్తమా, కిడ్నీ, గుండె జబ్బులతో బాధపడుతున్న వారు శ్వాస తీసుకోవడం ఇబ్బందిగా మారుతుంది. ఏక్యూఐ 200 దాటితే శ్వాస సమస్యలు ఎదుర్కొంటారు.ఎందుకంటే మందుగుండు పేలుడుతో వెదజల్లే వాయు కాలుష్యంలో కార్బన్ డయాక్సైడ్, నైట్రోజెన్ డయాక్సైడ్, సల్ఫర్ డయాక్సైడ్ మోతాదు అధికం. దీనివల్ల శ్వాస సమస్యలు వస్తాయి. దీపావళి రోజు రాత్రి ఏకంగా అమలాపురం, రాజమహేంద్రవరంలో ఏక్యూఐ 200 పాయింట్లు దాటేసింది.

పోలీసులే నిజమైన హీరోలు

- పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవంలో మంత్రి సుభాష్
- పాల్గొన్న కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ రాహుల్, ఎమ్మెల్యే ఆనందరావు
- అమరువీరుల స్థూపం వద్ద ఘనంగా నివాళులర్పించిన అతిథులు





సభలో మాట్లాడుతున్న మంత్రి సుభాష్, సెల్యూట్ చేస్తున్న ఎస్పీ రాహుల్



పోలీసు అమరవీరుల కుటుంబాలకు జ్ఞాపికను అందజేస్తున్న మంత్రి, కలెక్టర్, ఎస్పీ

అమలాపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దేశానికి నిజమైన హీరోలు పోలీసులే. సమాజ హితం కోసం రేయింబవళ్లు ప్రజల రక్షణ కోసం కృషి చేసిన, చేస్తున్న పోలీసుల త్యాగం చిస్మరణీయమైనదని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. అమలాపురం పోలీసు ప్రధాన కార్యాలయం వద్ద గల పోలీసు పెరేడ్ గ్రౌండ్‌లో పోలీసు అమరవీరుల స్మృతి దినం సందర్భంగా మంత్రి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి సుభాష్ మాట్లాడుతూ దేశంలోనే రాష్ట్ర పోలీసుశాఖ ఉత్తమమైనదిగా నిలుస్తోందని, సీఎం చంద్రబాబు, డీజీపీ హరీష్‌గుప్తా మార్గదర్శకత్వంలో పోలీసుశాఖ ఆధునిక,సాంకేతిక పరిజ్ఞానం,శక్తి యాప్ వంటి సౌకర్యాలతో ప్రజల సేవలో మమేకమవుతోందని అన్నారు. తొలుత సంస్మరణల స్థూపం వద్ద మంత్రితోపాటు కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ రాహుల్‌మీనా,ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ ఘనంగా నివాళులర్పించారు.ఎస్పీ రాహుల్‌మీనా ఆధ్వర్యంలో అతిథులకు స్వాగతం పలికారు. పోలీసు సిబ్బంది గౌరవ వందనం నిర్వహించారు. ఏఆర్ ఆర్ఐ బ్రహ్మానందం ఆధ్వర్యంలో పోలీసు కవాతు నిర్వహించిన తర్వాత కార్యక్రమానికి హాజరైనవారు స్మారక స్థూపం వద్ద పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మహేష్ కుమార్ మాట్లాడుతూ ప్రజాసేవలో ప్రాణాలర్పించిన పోలీసుల సేవలు అమూల్యమైనవన్నారు. ఎస్పీ రాహుల్‌మీనా మాట్లాడుతూ అమరవీరుల కుటుంబాలకు అన్నివిధాలా సహాయ,సహకారాలు అందించేందుకు తాను సిద్ధంగా ఉన్నానన్నారు. ఈ ఏడాది దేశవ్యాప్తంగా విధి నిర్వహణలో 191మంది అమరులవగా అందులో రాష్ట్రంలో ఐదుగురు ఉన్నారన్నారు. ఎమ్మెల్యే ఆనందరావు మాట్లాడుతూ సురక్షిత సమాజ నిర్మాణంలో పోలీసుల పాత్ర అమూల్యమైనదన్నారు. డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు భారీగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇటీవల అమరులైన ఎస్ఐ అశోక్‌కుమార్, కానిస్టేబుల్ బ్లెసన్‌జీవన్ కుటుంబాలకు మంత్రి సుభాష్, కలెక్టర్ మహేష్‌కుమార్, ఎస్పీ రాహుల్ జ్ఞాపికలు, సాయం అందజేశారు.

టెన్త్ విద్యార్థులకు వంద రోజుల ప్రణాళిక విడుదల



కార్యాచరణ ప్రణాళికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):జిల్లా విద్యాశాఖ ఉమ్మడి పరీక్షల నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో 2025-26 విద్యాసంవత్సరానికి పదోతరగతి వందరోజుల కార్యాచరణ ప్రణాళికను కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం విడుదల చేశారు. జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ సలీంబాషా ఆధ్వర్యంలో నిర్వహించిన డీసీఈబీ కార్యదర్శి బి.మనుమంతరావు, సీఎంవో బీవీవీ సుబ్రహ్మణ్యం, మున్సిపల్ హైస్కూలు హెచ్‌ఎం కాశి ఘనసత్యనారాయణ పాల్గొన్నారు. పదోతరగతి విద్యార్థులు ఉత్తీర్ణతశాతం పెంపుదల లక్ష్యంగా రూపొందించిన ఈ కార్యాచరణ ప్రణాళికలో బోధన,పునఃశ్చరణ, మాక్ టెస్టులు, పార్య ప్రగతి విశ్లేషణ, సమగ్ర మూల్యాంకానికి సంబంధించిన అంశాలు పొందుపరిచారు.

బి.దొడ్డవరం మధ్యలంకను రిజర్వు ఫారెస్టుగా ప్రకటిస్తాం

- జిల్లా అటవీశాఖ అధికారి ప్రసాదరావు



విదేశీ పక్షులను కెమెరాలో బంధిస్తున్న డీఎఫ్‌వో ప్రసాదరావు

మామిడికుదురు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విదేశీ పక్షులు వలసవచ్చి ఆవాసం ఏర్పరుచుకున్న బి.దొడ్డవరంలోని మధ్యలంక ప్రాంతాన్ని రిజర్వు ఫారెస్టు ప్రాంతంగా ప్రకటిస్తామని జిల్లా అటవీశాఖ అధికారి ఎంవీ ప్రసాదరావు పేర్కొన్నారు. విదేశీ వలస పక్షులు సేద తీరుతున్న దొడ్డవరంలోని మధ్యలంక ప్రాంతాన్ని ఆయన మంగళవారం పరిశీలించి విదేశీ పక్షలను తన కెమెరాలో బంధించారు. గత కొంత కాలంగా మధ్యలంకలో నివాసం ఉంటున్న ఓపెన్ బిల్ స్టార్క్ పక్షులుగా పేర్కొన్నారు. ఈ పక్షలు ఆగ్నేసియా నుంచి వలసవచ్చాయని, ఇవి ఆహారంగా నత్తలను పట్టుకుని తింటాయని అందువల్ల వీటిని నత్తకొట్టులు అంటారని తెలియచేశారు. వీటిని వేటాడడం నేరమని, వేటాడితే కేసుల్లో నమోదు కావాల్సి వస్తుందని హెచ్చరించారు.

మద్యం మత్తులో భార్యను కత్తితో పొడిచిన భర్త

- కంట్లో నుంచి నోట్లోకి దిగబడిన చాకు.. పి.గన్నవరం ఉడిమూడిలో ఘటన

మెయిన్‌లో..

రూ.16.5కోట్లతో వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు

- ధవళేశ్వరం నుంచి కోనసీమకు నేరుగా తాగునీటి పైపులైను ఏర్పాటు
- నష్టాలపై నివేదికలు సిద్ధం చేయండి
- సమీక్షలో కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశం

అమలాపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నేరుగా పైపులైను ద్వారా సురక్షితమైన తాగునీటిని సరఫరాకు రూ.16.50కోట్లతో జలజీవన్‌మిషన్ కింద వాటర్ గ్రిడ్ ప్రాజెక్టు అమలు చేయనున్నట్టు కలెక్టర్ మహేష్‌కుమార్‌ప్రకటిం చారు. ధవళేశ్వరంనుంచి నేరుగా తాగునీరు సరఫరా కోసం పైపులైను వ్యవస్థ నిర్మిస్తామని,ఇందుకు రోడ్లు, కాల్వలు, వివిధ కట్టడాల డ్యామేజీలపై ఆయాశాఖల ఇంజనీర్లు 15రోజుల కాలపరిమితితో మాస్టర్‌ప్లాన్ ప్రకారం నష్టాల అంచనాలను నివేదించాలని ఆదేశించారు.కలెక్టరేట్‌లో మంగళవారం ఎన్‌హెచ్, ఆర్‌అండ్‌బీ, డ్రైనేజీ, ఇరిగేషన్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ అధికారులతో కీలక సమావేశం నిర్వహించారు.నిధుల కేటాయింపునకు అవకాశం ఉందని, ఆ దిశగా అంచనాలు రూపొందించి నివేదిస్తే త్వరితగతిన పనులు చేపట్టేందుకు మార్గం సుగమం అవుతుందని అన్నారు. పైపులైన్ వేయబోయే మార్గాన్ని సర్వేచేస్తూ ఆ మార్గంలో రోడ్లు, కాల్వలు, డ్రైనేజీలు, ఇతర మౌలిక సదుపాయాలకు జరిగే డ్యామేజీలను గుర్తించాలన్నారు. ఈ ప్లానింగ్, మరమ్మతులు వంటి నివేదికల రూపకల్పనలో డాక్యుమెంటేషన్ సమగ్రంగా తయారీకి చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ఏఎస్ రాజన్, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ బి.రాము, పంచాయతీరాజ్ ఎస్ఈ పి.రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సీఎం ఆదర్శ గ్రామ యోజన పనులు త్వరితగతిన పూర్తిచేయాలి: కలెక్టర్

అమలాపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సీఎం ఆదర్శ గ్రామయోజన కింద అసంపూర్తిగా నిలిచిపోయిన పనులకు సంబంధించి ప్రణాళికలను సిద్ధం చేయాలని కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశించారు. పీఎం ఆవాస్‌యోజన, రెండు దశల గ్రామాభివృద్ధి ప్రణాళికలపై డీఎల్డీవోలు, ఎంపీడీవోలతో నిర్వహించిన ఈ సమీక్షలో కలెక్టర్ మాట్లాడుతూ గ్రామాల్లో 40శాతం ఎస్సీ ప్రజలు ఉన్నచోట్ల సామాజిక ఆర్థిక మానవాభివృద్ధికి ఈపథకం కీలక భూమిక వహిస్తుందన్నారు. మొదటిదశలో 65 పనులు ప్రారంభం కాలేదని, వాటి ఫీజుబులిటిపై అధికారులు అధ్యయనం చేసి వారంరోజుల్లో నివేదిక అందించాలని అన్నారు. ఎంపికైన గ్రామాలకు సగటున రూ.20లక్షలు ఖర్చు చేస్తారన్నారు.

బాణసంచా పేలుడులో మృతుల కుటుంబాలకు రూ.15 లక్షల చొప్పున పరిహారం 7

అక్కడ డిప్యూటీ ఎంపీడీవోలు!

- జిల్లాలో పది డిప్యూటీ ఎంపీడీవో పోస్టుల భర్తీ
- ఉత్తర్వులు జారీ చేసిన డీపీవో శాంతలక్ష్మి
- పంచాయతీ ఉద్యోగులకు పదోన్నతులు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని పది మండలాలకు డిప్యూటీ ఎంపీడీవోలను నియమిస్తూ జిల్లా పంచాయతీ అధికారి డి.శాంతలక్ష్మి ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వివిధ పంచాయతీల్లో సీనియర్ అసిస్టెంట్ హోదాలో పనిచేస్తున్న వ్యక్తులకు అడహక్ ప్రమోషన్‌లో భాగంగా వారిని జిల్లాలోని పది మండలాలకు డిప్యూటీఎంపీడీవోలుగా నియమిస్తూ ఉత్త ర్వులిచ్చారు. దీనిలోభాగంగా కపిలేశ్వరపురం మండలానికి మండపేట మండలం మారేడుబాకకు చెందిన గ్రేడ్-1 వీడీవో డి.వరప్రసాద్‌ను పదోన్నతిపై నియమించారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు ఈవో ఎస్.శంకర్‌నారాయణను కాట్రేనికోన మండలానికి, మలికిపురం మండలం మేడిచర్లపాలెంగ్రామానికి చెందిన వీడీవో ఐ.సుభాకర్‌బాబును కొత్తపేట, సీనియర్ అసిస్టెంట్ టీడీపీ శాస్త్రిని అమలాపురం రూరల్ ఎంపీడీవో కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీవోలుగా నియమించారు. సామర్లకోట మండలం నవర గ్రామానికి చెందిన వీడీవో ఎం.శివప్రసాద్‌ను రామచంద్రపురానికి, కె.గంగవరం మండలం కోట గ్రామానికి చెందిన ఎస్.రామకృష్ణను ఉప్పలగుప్తం మండలానికి, కాకినాడ రూరల్ మండలం ఇంద్రపాలేనికి చెందిన వై.భవానీశంకరుడును కె.గంగవరం మండలానికి, కరప మండలం పెదమద్రుకు చెందిన పీఎస్‌వీఆర్ బ్రహ్మానందాన్ని ముమ్మిడివరం, మామిడికుదురు మండలం ఈదరాడకు చెందిన పీవీఆర్కే రాజును ఆత్రేయపురం, తాళ్లరేవు ఎంపీపీ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న వీవీ నాగవీరేష్‌ను రావులపాలెం మండలానికి డిప్యూటీ ఎంపీడీవోలుగా నియమించారు. మలికిపురం మండలం మినహా అన్నిచోట్ల డిప్యూటీ ఎంపీడీవో పోస్టుల నియామకంపై సహ ఉద్యోగులు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు.

31లోగా త్రైమాసిక పన్నులు చెల్లించాలి

- లేదంటే చర్యలు తప్పవు: డీటీవో

అమలాపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో వివిధ వాహనదారులు త్రైమాసిక పన్నుతోపాటు అపరాధ రుసుమును చెల్లించాలని జిల్లా రవాణాశాఖ అధికారి దేవిశెట్టి శ్రీనివాస్ ఒక ప్రకటనలో కోరారు. వాహనదారులు అక్టోబరు 31లోగా చెల్లించే త్రైమాసికపన్నుతోపాటు పెండింగ్ అపరాధ రుసుం చెల్లించాలని కోరారు.ఇప్పటికే వాహనదారులందరికీ అపరాధరుసుం నోటీసులు పంపించామని, నెలాఖరులోగా ఆన్‌లైన్‌లో చెల్లించామని, లేదంటే మోటారువాహనాల చట్టం ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటామని డీటీవో హెచ్చరించారు.

కార్తీకం.. సత్యదేవుడి సన్నిధి సిద్ధం!

- భక్తులకు ఏర్పాట్లు పూర్తి
- ఈ నెలలో సుమారు 20 లక్షల మంది విచ్చేస్తారని అంచనా
- 1.50 లక్షల వ్రతాలు జరిగే అవకాశం



దాత నిర్మించిన భారీ విశ్రాంత షెడ్డు

పశ్చిమ రాజగోపురం వద్ద వ్రత భక్తుల కోసం ఏర్పాటు చేసిన హోల్డింగ్ పాయింటు

అన్నవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): హరిహరులకు ఎంతో ప్రీతికరమైనది కార్తీకమాసం. ఈ కార్తీకంలో హరిహరక్షేత్రంగా విరాజిల్లుతున్న కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుడి సన్నిధికి ఉభయ తెలుగురాష్ట్రాల నుంచి సుమారు 20 లక్షలమంది తరలివస్తారని అంచనాతో దానికణుగుణంగా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా ముందుజాగ్రత్త చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే వివిధ శాఖలు సమన్వయంతో పలు లక్ష్యాలను నిర్దేశించుకోగా వాటిని ఆచరణలోకి తీసుకొచ్చారు. పర్వదినాల్లో ఒంటిగంట నుంచి వ్రతాలు, సర్వదర్శనాలు ప్రారంభించాలని నిర్ణయించారు. పశ్చిమ రాజగోపురం వద్ద ఎటువంటి తోపులాటలకు ఆస్కారం లేకుండా వాటర్‌ప్రూఫ్ షెడ్డు వేసి హోల్డింగ్ పాయింట్లు ఏర్పాటు చేశారు. లోపల వ్రత మండపాలు ఖాళీ అయితేనే హోల్డింగ్ పాయింట్ నుంచి భక్తులు లోపలకి చేరతారు. వాహనాలు అన్నింటికీ వన్‌వే మార్గం ఏర్పాటుచేశారు. పశ్చిమ రాజగోపురం ఎదురుగా సుమారు రూ.2.50 కోట్లతో ఫార్మాస్యూటికల్ సంస్థ సహకారంతో భారీ షెడ్డును వినియోగంలోకి తీసుకొచ్చారు. దీనిలో వ్రతం, దర్శనం, ప్రసాదం టిక్కెట్లు విక్రయాలు జరుపుతారు. అదేవిధంగా భక్తులు వేచిఉండేవిధంగా ఏర్పాట్లు చేశారు. ఎక్కడికక్కడ పోలీస్ బందోబస్తు, వాకీటాకీల ద్వారా పర్యవేక్షణ చేసేందుకు చర్యలు తీసుకున్నారు. ఎప్పటికప్పుడు కమాండ్ కంట్రోల్‌రూం ద్వారా అధికారులు, సిబ్బందికి సూచనలు చేసేలా యంత్రాంగాన్ని సిద్ధం చేశారు. వివిధ వాహనాల్లో విచ్చేసే భక్తులకు పార్కింగ్ సత్యగిరికి తరలించి అక్కడినుంచి దేవస్థానం ఉచిత వాహనాల్లో స్వామి సన్నిధికి చేర్చుతారు. నవంబరు 2న స్వామివారి తెప్పోత్సవం సాయంత్రం 5.30కి ప్రత్యేకపూజలతో ప్రారంభమై రాత్రి 7.30కి పంపా సరోవరంలో నౌకావిహారం జరుపుతారు. ప్రధానంగా కార్తీకపౌర్ణమి రోజున జరిగే గిరిప్రదక్షిణకు సుమారు 2 లక్షల మంది విచ్చేయనుండగా.. ఉదయం 8 గంటలకు తొలి పావంచా వద్ద నుంచి స్వామి,అమ్మవార్లను పల్లకీలో మధ్యాహ్నం 2గంటల నుంచి సత్యరథంపై గిరియాత్ర నిర్వహిస్తారు. భక్తులు సత్యరథం ద్వారా గిరియాత్ర చేపట్టాలని అధికారులు కోరారు.

వాహనదారులు నిబంధనలు పాటించడం తప్పనిసరి



ఆటో, బస్సు, ఇతర వాహనాల డ్రైవర్లతో సమావేశంలో పాల్గొన్న అన్నవరం దేవస్థానం ఈవో, ఎస్ఐ

అన్నవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం పురస్కరించుకుని వేలాదిగా రోడ్డు, రైలు మార్గాల్లో అన్నవరం విచ్చేసిన భక్తులను కొండపైకి తీసుకెళ్లే ఆటో, బస్సు, ఇతర ప్రయివేట్ వాహనదారులతో సోమవారం అన్నవరం ఎస్ఐ హరిబాబు, దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు. ప్రధానంగా లైసెన్స్, ఇతర డాక్యుమెంట్లను కలిగి ఉండాలని, యూనిఫాం ధరించి, అతివేగంగా వాహనాలు నడపకుండా ఉండాలన్నారు. నిర్ణయించిన పాసింజర్ల కంటే ఎక్కువమందిని ఆటోలో ఎక్కించకుండా వారిపై గౌరవంగా మాట్లాడడం, ఎవరైనా తమ లగేజీని ఆటోలో మరిచిపోయిన ఎడల వారికి బాధ్యతగా అప్పగించడం, సంబంధిత విషయాన్ని పోలీసులకు తెలియపరచడం చేయాలని సూచించారు. ఎవరైనా అనుమానాస్పదంగా తిరుగుతుంటే వెంటనే పోలీసులకు సమాచారం అందజేయాలన్నారు. ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడకుండా, నిర్దేశిత ప్రదేశాల్లో పార్కింగ్ చేయాలన్నారు. రాంగ్‌రూట్‌లో ప్రయాణాలు నిషిద్ధమని, నిబంధనలు ఉల్లంఘిస్తే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో దేవస్థానం ట్రాన్స్‌పోర్టు అధికారులు పాల్గొన్నారు.

ముగ్గురు ప్రత్యేకాధికారుల నియామకం

అన్నవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా సత్యదేవుడి సన్నిధికి లక్షలాదిగా విచ్చేసే భక్తుల రద్దీ నేపథ్యంలో ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఉండేందుకు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ ముగ్గురు దేవదాయశాఖ అధికారులను డిప్యూటేషన్‌లో ప్రత్యేకంగా నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. డిప్యూటీ కమిషనర్ రమేష్ బాబు, వాడపల్లి దేవస్థానం ఈవో ఎస్.చక్రధరరావు, లోవ దేవస్థానం ఈవో విశ్వనాధరాజును నియమించారు. కార్తీకమాసంలో 4 శని,ఆది,సోమవారాలు.. 2 దశమి, ఏకాదశిలు, కార్తీకపౌర్ణమి గిరిప్రదక్షిణ, తెప్పోత్సవం వంటి ముఖ్యమైన రోజు ల్లో విపరీతమైన రద్దీ ఉంటుంది. నిర్దేశించిన రోజుల్లో వీరంతా అన్నవరంలో ఉండి భక్తుల కోసం క్యూలైన్లు, వ్రతాల నిర్వహణ, మౌలిక వసతులు పర్యవేక్షణ చేయనున్నారు.

సత్యదేవుడికి హైకోర్టు న్యాయమూర్తి పూజలు



హైకోర్టు న్యాయమూర్తికి స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఈవో

అన్నవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో మంగళవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టీస్ నైనాల జయసూర్య కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈవో వీర్ల సుబ్బారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. అనంతరం ఈవో వారికి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

బాణసంచా పేలుడులో మృతుల కుటుంబాలకు
రూ.15 లక్షల చొప్పున పరిహారం

అనపర్తి, మండపేట ఎమ్మెల్యేలు రామకృష్ణారెడ్డి, జోగేశ్వరరావు వెల్లడి



అనపర్తిలో వివరాలను వెల్లడిస్తున్న ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

అనపర్తి/మండపేట/రాయవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం వి.సావరం, తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం కొమరిపాలెం సరిహద్దుల్లోని లక్ష్మీ గణపతి ఫైర్ వర్క్స్‌లో ఈ నెల 8న జరిగిన అగ్ని ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఒక్కొక్కరికీ రూ.15 లక్షల ఎక్స్‌గ్రేషియాను సీఎం చంద్రబాబు మంగళవారం ప్రకటించారని అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తెలిపారు. అనపర్తిలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రమాదం జరిగిన వెంటనే తాను మండపేట ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావుతో కలిసి సహాయక చర్యల్లో పాల్గొనడంతో పాటు ఎప్పటికప్పుడు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ ఘటనకు సంబంధించి ప్రభుత్వం ద్విసభ్య కమిటీ ఏర్పాటు చేసిందన్నారు. అయితే కర్నూలులో ప్రధాని పర్యటన నేపథ్యంలో కమిటీ విచారణ కొంత ఆలస్యం అయినప్పటికీ మంగళవారం నివేదిక అందిన వెంటనే ముఖ్యమంత్రి పరిహారం ప్రకటించారన్నారు. ఈ ప్రమాదంలో యజమాని సహా పదిమంది మృతిచెందారని, బాధిత కుటుంబాలకు సరైన పరిహారం అందించేందుకు ముఖ్యమంత్రిని ఒప్పించడంలో మంత్రులు సుభాష్, అనిత, ఎమ్మెల్యే జోగేశ్వరరావు తనతో పాటు కృషి చేశారని పేర్కొన్నారు. కార్మిక శాఖ నుంచి ఈ పరిహారం త్వరలోనే బాధిత కుటుంబాలకు అందజేస్తామని, అలాగే యజమాని తరపున కూడా పరిహారం అందే విధంగా కృషి చేస్తామన్నారు. పది మంది మృతుల్లో అనపర్తి నియోజకవర్గానికి చెందిన వారు ఏడుగురు ఉన్నారని ఎమ్మెల్యే పేర్కొన్నారు. మండపేటలో రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్, వేగుళ్ల జోగేశ్వరరావు మాట్లాడుతూ రెండురోజుల్లో మంత్రి వాసంశెట్టి సుభాష్ చేతులమీదుగా బాధితులకు ఆర్థికసాయం అందజేస్తామని తెలిపారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే బాలింత మృతి

పిఠాపురంలో మృతురాలి తల్లిదండ్రులు, బంధువుల ఆందోళన



పిఠాపురం ప్రభుత్వాసుపత్రి వద్ద శిశువుతో బంధువులు

పిఠాపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం ప్రభుత్వాసుపత్రి వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే బాలింత మృతి చెందిందని, శిశువును చిదిమేశారని మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు ఆరోపించారు. వారు మంగళవారం ప్రభుత్వాసుపత్రికి చేరుకుని ఆందోళనకు దిగారు. అనంతరం పాడా పీడీకి ఫిర్యాదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలు గ్రామానికి చెందిన దొండపాటి శ్రీదుర్గ (25) ఈనెల 13న డెలివరీ కోసం ప్రభుత్వాసుపత్రిలో చేరింది. 14న డెలివరీ కాగా తల్లి, బిడ్డల పరిస్థితి సీరియస్‌గా మారడంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి పంపగా అక్కడ చికిత్స పొందుతూ శ్రీదుర్గ మరణించింది. శిశువును డెలివరీ సమయంలో చిదిమివేయడంతో ఒక వైపు చేయి పనిచేయకపోవడంతో పాటు కంటి పై గాయమైంది. హైరిస్క్ పేషేంటుగా ఉన్న శ్రీదుర్గకు ఎటువంటి జాగ్రత్తలు తీసుకోకుండా బలవంతంగా నార్మల్ డెలివరీ చేయడం వల్లే మరణించిందని మృతురాలి తల్లిదండ్రులు దొండపాటి రాజు, సుబ్బారావు ఆరోపించారు. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ తల్లిదండ్రులు, వారి బంధువులు ప్రభుత్వాసుత్రి వద్ద ఆందోళన నిర్వహించారు. హైరిస్క్ కేసు అని గుర్తించినా ఎందుకు జాగ్రత్తలు తీసుకోలేదని నిలదీశారు. వారికి గొల్లప్రోలు జడ్పీటీసీ ఉలవకాయల నాగలోవరాజు సంఘీభావం తెలిపారు. వారి ఆందోళనతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. పిఠాపురం పట్టణ ఎస్ఐ మణికుమార్, పోలీసులు వచ్చి ఆందోళనకారులతో చర్చించారు. మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు, జడ్పీటీసీ లోవరాజు పిఠాపురం పాడా కార్యాలయానికి చేరుకుని ప్రభుత్వాసుపత్రిలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంపై ప్రాజెక్టు డైరెక్టర్ చైత్రవర్షిణికి ఫిర్యాదు చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని పీడీ హామీ ఇవ్వడంతో వారు ఆందోళన విరమించారు.

తంద్రవుతాడనుకుంటే తనువు చాలించే..

మోటారు సైకిళ్లు ఢీకొన్న ఘటనలో యువకుడి మృతి
అతడి భార్య 9 నెలల గర్భిణి



లోవరాజు (ఫైల్)



బోరున విలపిస్తున్న లోవరాజు భార్య, తల్లి, అక్క, బంధువులు

కపిలేశ్వరపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం శివారు కొండాలమ్మ ఆలయ సమీపంలో సోమవారం రాత్రి ఎదురెదురుగా రెండు మోటారుసైకిళ్లు ఢీకొన్న ఘటనలో యువకుడు మృతి చెందాడు. అతడి భార్య 9 నెలల గర్భిణి కావడంతో ఆ కుటుంబం బోరున విలపిస్తుంది. మంగళవారం అంగర పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కపిలేశ్వరపురం గ్రామశివారు సత్యనారాయణపురానికి చెందిన కముజు లోవరాజు(33) మోటారు సైకిల్‌పై అంగర వైపు వెళ్తుండగా ఎదురుగా వస్తున్న బైక్ బలంగా ఢీకొంది. లోవరాజు తలకు తీవ్రగాయం కావడంతో మృతిచెందాడు. మరో బైక్‌పై ఉన్న కాట్రేనికోన మండలం దొంతుకుర్రుకి చెందిన కాలేటి బాలయోగి, గెడ్డం నాగార్జునకు గాయాలు కావడంతో స్థానిక సీహెచ్‌సీకి తరలించారు. లోవరాజు 104 వాహనం డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతడి సోదరుడు కముజు వీరవెంకటసత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మండపేట ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు ఎస్ఐ హరీష్‌కుమార్ పేర్కొన్నారు. లోవరాజు భార్య దుర్గ నీలిమ 9నెలల గర్భిణి, ఆసుపత్రిలో చేయాల్సి ఉండగా ఇంతలోనే ఇలా జరగడం పట్ల కుటుంబీకులు, బంధువులు జీర్ణించుకోలేక బోరున విలపిస్తున్నారు. లోవరాజు చిన్నవయసులోనే మృత్యువాత పడడంతో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి.

రైల్వే పట్టాలపైకి వరదనీరు...
రైల్వే అధికారుల సమీక్ష

పుంత రహదారులు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణల కారణంగానే ముంపు అని గుర్తింపు



సామర్లకోట ఎఫ్‌సీఐ గోదాముల వద్ద పుంత రహదారిని పరిశీలిస్తున్న అధికారులు

సామర్లకోట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట రైలు పట్టాలపైకి ఆదివారం పెద్దఎత్తున వరదనీరు చేరిక, పలు రైళ్ల రాకపోకలకు సుమారు 16 గంటల పాటు అంతరాయం వంటి సంఘటనలను రైల్వే ఉన్నతాధికారులు సీరియస్‌గా తీసుకున్నారు. ఈ విషయంపై సోమవారం ఆంధ్రజ్యోతిలో వచ్చిన కథనంపై రైల్వే ఉన్నతాధికారులు సమీక్షించారు. క్షేత్రస్థాయిలో పరిస్థితిని అధ్యయనం చేయాలని ఆదేశించడంతో రైల్వే ఏఈఎన్ ప్రభాకర్, అధికారులు, సిబ్బంది మంగళవారం సత్యనారాయణపురం శివారు వీర్రాజునగర్, ఎఫ్‌సీఐ గోదాములు, మట్టలవారి చెరువు, ఏడీబీ రోడ్డు వంటి ప్రాంతాలను పరిశీలించి పట్టణ ఎగువ ప్రాంతాల్లో గరువులలో కురిసిన వర్షం నీరు రాకకు పూర్వం నుంచీ ఉన్న పుంతమార్గాలు, చెరువులకు ఉన్న స్లూయిజ్‌ల మార్గాలను, రైల్వే కాలువల నుంచి మున్సిపల్ డ్రైన్‌లోకి సత్యనారాయణపురం ఫ్లయ్‌ఓవర్‌బ్రిడ్జి పక్కనుంచి ఉన్న ప్రధాన డ్రైనులను పరిశీలించారు. పుంత రహదారులు పూర్తిగా ఆక్రమణలకు గురైనట్టు గుర్తించారు. అలాగే ఏడీబీ రోడ్డు మీదుగా రాక్ సిరామిక్ సమీపం నుంచి ఎఫ్‌సీఐ గోదాములు పక్క నుంచి రైల్వే తూముల మీదుగా పూర్వం నుంచి ఉన్న పుంత రహదారిని పూర్తిగా ఆక్రమించడం వల్ల ఎగువ ప్రాంతాల్లో వరదనీరు ఆ తూములమీదుగా కాకుండా రైలు పట్టాలపైకి చేరుతున్నందునే ముంపు సమస్య ఎదుర్కొంటున్నట్టు ప్రాథమికంగా గుర్తించి నివేదికలు రూపొందించారు. సత్యనారాయణపురం శివారున రైల్వే గోతులు ఆక్రమణలకు గురై పెద్దపెద్ద భవనాలు నిర్మించినట్టు క్షేత్రస్థాయిలో గుర్తించారు. ఆక్రమణలను గుర్తించేందుకు శాశ్వత ప్రాతిపదికన, భవిష్యత్తులో రైలు పట్టాల పైకి వరదనీరు చేరకుండా ఉండేందుకు రక్షణ చర్యలు చేపట్టేందుకు రైల్వే, మున్సిపల్, రెవెన్యూ, ఇరిగేషన్, విద్యుత్ అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించాలని స్థానిక అధికారుల బృందం నిర్ణయించి రైల్వే ఉన్నతాధికారుల అనుమతుల కోసం నివేదికలు పంపారు.

యువకుడిపై పోక్సో కేసు

రాజమహేంద్రవరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బాలికను అత్యాచారం చేసిన యువకుడిపై తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం టూటౌన్ పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. టూటౌన్ సీఐ శివగణేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. కాకినాడ జిల్లాకు చెందిన ఓ బాలిక (16) రాజమహేంద్రవరంలోని ఓ వసతి గృహంలో ఉంటూ పదో తరగతి చదువుతోంది. దీపావళి రోజున జొన్నాడకు చెందిన అజయ్ అనే యువకుడు తనకు మాయ మాటలు చెప్పి బలవంతంగా ఓ లాడ్జికి తీసుకెళ్లి అత్యాచారం చేశాడని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై పోక్సో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు. నిందితుడి కోసం గాలిస్తున్నామని పేర్కొన్నారు.

క్రీడా అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అందించే అత్యున్నత క్రీడా పురస్కారాలైన మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న, అర్జున, ద్రోణాచార్య అవార్డులతోపాటు రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కారాలు-2026కు సంబంధించి అర్హులైన క్రీడాకారులు, కోచ్‌లు, సంస్థలు దరఖాస్తులు అందజేయాలని తూర్పుగోదావరి జిల్లా క్రీడాభివృద్ధి అధికారి డీఎంఎం శేషగిరి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 28లోపు కేంద్ర ప్రభుత్వ క్రీడా శాఖ అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

సామర్లకోటలో బాలుడిపై కానిస్టేబుల్ దాడి

దళిత సంఘాల ఆందోళన



సామర్లకోట ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న దళిత సంఘాలు

సామర్లకోట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట బ్రౌన్‌పేటలో దీపావళి వేడుకల్లో తారాజువ్వలను నేలబారున విడుస్తున్నారన్న ఫిర్యాదులతో సోమవారం రాత్రి 10 గంటలకు దడాల అక్షయ్‌కుమార్ అనే దళిత బాలుడిపై పోలీసు కానిస్టేబుల్ సతీష్ దాడి చేయడంతో అపస్మారకస్థితికి చేరి ఆసుపత్రి పాలయ్యాడని దళిత సంఘాలు ఆందోళనకు దిగాయి. పోలీసులు వైఖరిని నిరసిస్తూ ప్రభుత్వాసుపత్రి ఎదుట నిరసన తెలిపారు. అక్షయ్‌కుమార్‌కు ప్రభుత్వాసుపత్రిలో ప్రాథమిక చికిత్స నిర్వహించి ఉన్నత చికిత్స నిమిత్తం కాకినాడ లో ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అతడి ఆరోగ్య పరిస్థితి బానే ఉన్నట్టు ఆసుపత్రి వర్గాలు వెల్లడించడంతో దళితసంఘాలు ఆందోళనలు విరమించారు. సతీష్‌పై కేసు నమోదు చేయాలని, బాధితుడికి ఆర్థిక సాయం అందించాలనే డిమాండ్లపై పోలీసులు చర్చలు జరిపారు. సతీష్ లాఠీతో కొట్టడం వల్ల అక్షయ్ ఫిట్స్ వచ్చి పడిపోయాడని ఆందోళనకారులు ఆరోపించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు సామర్లకోట పోలీసులు పోలీసులు తెలిపారు.

దాడి చేయలేదు : డీఎస్పీ

సామర్లకోటలో బాలుడిపై పోలీసులు ఎవ్వరూ దాడి చేసి గాయపర్చలేదని పెద్దాపురం డీఎస్పీ శ్రీహరిరాజు వెల్లడించారు. దళిత యువకుడు అక్షయ్‌కుమార్‌నే కాదు మర్వెరినీ పోలీసులు కొట్టలేదని డీఎస్పీ శ్రీహరిరాజు ఖండించారు. మంగళవారం రాత్రి ఈ మేరకు సామర్లకోట పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ శ్రీహరిరాజుతో బాటు సీఐ కృష్ణభగవాన్ కూడా పాల్గొన్నారు.

చిన్నింపేటలో పొల్యూషన్ బోర్డు కమిటీ తనిఖీలు



చిన్నింపేట సీపీఎఫ్ పరిశ్రమ పరిధిలో తనిఖీలు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

ఏలేశ్వరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరం మండలం చిన్నింపేట గ్రామంలో ఉన్న సీపీఎఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కర్మాగారంలో మంగళవారం జాతీయ పొల్యూషన్ బోర్డు కమిటీ సభ్యులు తనిఖీలు చేశారు. పరిశ్రమ నుంచి విడుదలయ్యే వ్యర్థాలు, శుద్ధి చేయని వ్యర్థ జలాలు చుట్టుపక్కల ఉన్న పొలాలకు కలుషిత నీరు చేరడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని గ్రామానికి పిల్లి చంద్రరావు ఫిర్యాదు చేశాడు. జాయింట్ కమిటీ సభ్యులు తనిఖీలకు హాజరై పరిశ్రమ నుంచి పొలాల్లో విడుదలయ్యే వ్యర్థాలు, నీటిని పరిశ్రమ పరిధిలో పరిశీలించారు. ఈ వివరాలు చెప్పేందుకు కమిటీ సభ్యులు నిరాకరించారు.

కాకినాడలో మహిళ అనుమానాస్పద మృతి



లక్ష్మి మృతదేహం

కాకినాడ క్రైం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో మంగళవారం ఓ మహిళ అనుమానాస్పదంగా మృతి చెందింది. వివరాలిలా ఉన్నాయి. కర్నాటక రాష్ట్రానికి చెందిన కేఎస్ వెంకటేష్ స్థానిక ఎస్ఆర్‌కే బిల్డింగ్‌లో బేకరీ నిర్వహిస్తున్నాడు. ఇదే భవనం పై అంతస్తులో బేకరీకి సంబంధించిన కార్ఖానా ఉంది. ఇందులో స్థానిక బాలాజీచెరువు సెంటర్‌కు చెందిన ర్యాలీ లక్ష్మి (40) 2 నెలలుగా పనిచేస్తోంది. అయితే మంగళవారం సాయంత్రం యజమాని బేకరీలో బేరం చూస్తుండగా పై అంతస్తులోని ఖార్కానాలో ఉన్న లక్ష్మి అచేతనంగా పడిఉంది. ఈ విషయాన్ని ఆ పక్కనే ఉన్న దుకాణం యాజమాని గుర్తించి బేకరీ యాజమానికి సమాచారం ఇవ్వగా వెంకటేష్ వచ్చి లక్ష్మి కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. అనంతరం పోలీసులకు తెలిపాడు. ఆటోలో లక్ష్మిని జీజీహెచ్‌కు తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే ఆమె మృతిచెందినట్లు నిర్ధారించారు. లక్ష్మి భర్త నుంచి వేరుపడి ఉందని, ఆమెకు పదేళ్ల కుమార్తె ఉందని బంధువులు తెలిపారు. ఈ మేరకు కాకినా త్రీ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టుకు ఉరేసుకున్న వ్యక్తి



పంకజ్ (ఫైల్‌ఫొటో)

తుని రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చెట్టుకు వ్యక్తి ఉరేసుకుని మృతిచెందిన ఘటన కాకినాడ జిల్లా తుని పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. తుని ఎస్ఐ విజయ్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. అస్సాం రాష్ట్రానికి చెందిన పంకజ్ 20 రోజులుగా మతిస్థిమితం లేకుండా తుని రైల్వే స్టేషన్ పరిధిలో తిరుగుతున్నాడు. తుని రైల్వే స్టేషన్ శివారు తాళ్ళూరు రైల్వేగేటు సమీపంలో ఓ చెట్టుకు ఉరేసుకుని మృతి చెందాడు.

కారు ఢీకొని తండ్రీకొడుకులకు గాయాలు

ముమ్మిడివరం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం కాశివాని తూము బైపాస్ సెంటర్‌లో మోటారుసైకిల్‌పై రోడ్డును దాటుతుండగా ఓ కారు వేగంగా వచ్చి ఢీకొంది. దీంతో మోటారుసైకిల్‌పై ఉన్న తండ్రీ కొడుకులు గాయపడ్డారు. 2016 జాతీయ రహదారి కాశివానితూము బైపాస్ సెంటర్‌లో మంగళవారం ఈ ప్రమాదం జరిగింది. మోటారు సైకిల్‌పై వెళుతున్న ముమ్మిడివరం మండలం గురజాపులంకకు చెందిన యడ్ల సుభాష్‌బాబు, యడ్ల అర్జున్‌కుమార్ గాయపడ్డారు. ఈ ఘటనలో తండ్రి తీవ్రంగా గాయపడగా కుమారుడు స్వల్పంగా గాయపడ్డాడు. గాయపడిని వారిని అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించారు.

ఇసుక లారీలను నియంత్రించాలి

కన్నాయిగూడెం వాసుల ఆందోళన
కదిలిన అధికారులు, ఎమ్మెల్యే తెల్లం



ఇసుక లారీలు నిలిపి ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

ఎటపాక, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ఇసుక లారీలు నియంత్రించాలని, డ్రైవర్లు నిర్లక్ష్యంగా ప్రమాదకర రీతిలో లారీలు నడుపుతున్నారని..వాటి రాకపోకలతో రహదారులు ధ్వంసవుతున్నాయని కన్నాయిగూడెం వాసులు ఆందోళనబాట పట్టారు. అల్లూరి జిల్లా ఎటపాక మండలం రాష్ట్ర సరిహద్దులోని కన్నాయిగూడెం వద్ద గ్రామస్తులు భద్రాచలం- చర్ల అంతరాష్ట్ర రహదారిపై 2 రోజుల పాటు ఇసుక లారీలను అడ్డుకున్నారు. దీంతో సరిహద్దులోని 2రాష్ట్రాల పరిధిలోని పోలీసులు, రెవెన్యూతోపాటు భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు కదిలారు. ఆయన మాట్లాడుతూ భద్రాచలం నుంచి చర్ల వరకు చేపట్టే రహదారి మరమ్మతుల పనుల్లో భాగంగా మధ్యలో తమ పరిధి (ఆంధ్ర)లో ఉన్న ఎటపాక నుంచి కన్నాయిగూడెం వరకు కూడా రహదారి మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. మరమ్మతులు పూర్తయ్యేవరకు ఇసుక రావాణా చేయవద్దని తెలంగాణలోని చర్ల, భద్రాచలం మండలాల తహశీల్దార్లను ఆదేశించారు. మరోవైపు చింతూరు పీవో శుభం నోక్వాల్ సైతం స్పందించారు. కన్నాయిగూడెం వాసులతో ఫోన్‌లో మాట్లాడారు. ఆంధ్ర పరిధి వరకు రహదారి మరమ్మతులు చేస్తామని హామీఇచ్చారు. ఆందోళనలతో సుమారు 10 కిలోమీటర్ల మేర ఇసుక లారీలు నిలిచిపోయాయి. తెలంగాణలోని దుమ్ముగూడెం మండలానికి చెందిన కొందరు ఇసుక లోడ్ లారీలను కన్నాయిగూడెంలో గ్రామస్తులు నిలుపుదల చేసిన విషయంపై అభ్యంతరం చెప్పడంతో ఎస్ఐ అప్పల రాజు, సీఐ కన్నపరాజు జోక్యం చేసుకున్నారు. పోలీసులు ఇసుక లారీలను పంపించివేయడంతో వివాదం సద్దుమనిగింది.

ఆ హా.. కాశం..



నీలి నీలి ఆకాశం... దట్టంగా అలముకున్న తెల్లటి మేఘాలు... ఇవి ఆకాశంలో తెల్లటి కొండలు మాదిరిగా కనిపించాయి. కాకినాడ జిల్లా పిఠాపురం 216వ జాతీయ రహదారిపై కనిపించిన ఈ దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది. - పిఠాపురం (ఆంధ్రజ్యోతి)

అమలాపురం

పీడీఎస్ బియ్యం స్వాధీనం

అమలాపురంటౌన్,అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సివిల్ సప్లయి డైరెక్టర్ కడలి ఈశ్వరి ఆధ్వర్యంలో మంగళవారం అమలాపురంలో బియ్యం దుకాణాలపై దాడులు నిర్వహించారు. అమలాపురంలోని లలిత రైస్ స్టోర్స్‌లో 300కిలోల పీడీఎస్ బియ్యాన్ని ఆమె గుర్తించారు.7బస్తాల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని 6ఏకేసు నమోదు చేశారు.

అన్నదానానికి విరాళాలు

అయినవిల్లి, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): అయినవిల్లి శ్రీవిఘ్నేశ్వరస్వామిని మంగళవారం అమలాపురానికి చెందిన గంచి పుత్ర మాల్ కుటుంబ సమేతంగా దర్శించుకుని అన్నప్రసాద ట్రస్టుకు రూ.51,111 విరాళంగా అందజేశారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన జగత కృష్ణతులసి-రామ్మోహనరావు రూ.10,116 విరాళం అందజేశారు

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి

- ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ
- పోలీసు అమరవీరుల దినోత్సవం




పి.గన్నవరంలో కొవ్వొత్తుల ర్యాలీలో ఎమ్మెల్యే గిడ్డి, పోలీసులు, అంబాజీపేటలో కొవ్వొత్తుల ర్యాలీ

పి.గన్నవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విధి నిర్వహణలో నిరంతరం శ్రమించేఉద్యోగి పోలీసు మాత్రమేనని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పోలీసుల అమరవీరుల త్యాగాలు మరువలేవనివన్నారు. పి.గన్నవరం త్రిరోడ్ సెంటర్‌లోనిర్వహించిన అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అమరవీరుల స్థూపంతో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ వద్ద ఎమ్మెల్యే పుష్పగుచ్ఛం ఉంచి అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిం చారు. కార్యక్రమంలో సీఐ ఆర్.భీమరాజు, ఎస్‌ఐలు బి.శివకృష్ణ, హరికోటి శాస్త్రి, కె.చిరంజీవి, ఏ.చైతన్యకుమార్, దాసరి వీర వెంకటసత్యనారాయణ, పెనుమాల లక్ష్మి, చిట్టూరి శ్రీనివాస్, చెల్లిబోయిన గంగాదేవి, శిరిగినీడి వెంకటేశ్వరరావు, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ, జాలెం శ్రీనివాసరాజా, ఆదిమూలం సూరయ్యకాపు, వాసంశెట్టి కుమార్, బోణం బాబు, శేరు శ్రీనుబాబు, బొరుసు సత్యనారాయణ, కె.సత్యనారాయణరాజు, గుత్తుల చంటి, చుట్టుగుళ్ల కిషోర్, కుంపట్ల నాయుడు, తాటికాయల శ్రీనివాసరావు, కోట రాజేంద్ర, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్ అన్నారు. సీఐ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. రాజోలు పోలీసు స్టేషన్ కార్యాలయం నుంచి ఎల్‌ఐసీ కార్యాలయం సమీపంలో ఉన్న సార్జెంట్ రవి ప్రసాద్ స్థూపం వరకు ర్యాలీ నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలు త్యాగం చేసిన అమరవీరులకు స్థూపం వద్ద సీఐ నరేష్‌కుమార్ నివాళులర్పించారు. కార్యక్రమంలో రాజోలు ఎస్ఐ బి.రాజేష్‌కుమార్, మలికిపురం, సఖినేటిపల్లి ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని పలువురు వక్తలు పేర్కొన్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్, సెంటర్‌లో పోలీసు అమరవీరులకు నివాళులర్పించారు. విధి నిర్వహణలో అశువులు బాసిన వారి త్యాగాలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, సొసైటీ చైర్మన్ అరిగెల సూరిబాబు, నాయకులు నాగాబత్తుల సుబ్బారావు, ఉందుర్తి నాగబాబు, సుంకర బాలాజీ, కొర్లపాటి గోపి, దొమ్మేటి సాయికృష్ణ, ఆదుర్తి నారాయణమూర్తి, మాచవరపు శివన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహాలతో దీపావళి వేడుకలు



మామిడికుదురులో దీపావళి బాణసంచా కాలుస్తున్న ఓ కుటుంబ సభ్యులు

మామిడికుదురు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): దీపావళి వేడుకలను గ్రామాల్లో ప్రజలు ఆనందోత్సాహాల మధ్య సోమవారం రాత్రి ఘనంగా జరుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి ఒకరికొకరు దీపావళి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. లక్ష్మీదేవి పూజ నిర్వహించి దీపాలు వెలిగించి ఉత్సాహంగా బాణసంచా కాల్చారు. పలు గ్రామాల్లో ప్రధాన కూడళ్ల వద్ద అరటి బోదెలు ఏర్పాటుచేసి అక్కడ దీపాలు వెలిగించి ఆధ్మాతిక కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులు కేరింతలు కొడుతూ సందడి చేశారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సోమవారం దీపావళి పండుగను ప్రజలు ఆనందంగా జరుపుకున్నారు. వాతావరణం అనుకూలించడంతో మండలంలో బాణసంచా దుకాణాలు వినియోగదారులతో కళకళలాడాయి. ప్రతి ఇంటా లక్ష్మీదేవికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసుకుని దీపాలు వెలిగించి బాణసంచా కాల్చారు. ప్రతి గ్రామంలో దీపావళి సందర్భంగా ఆలయాలు భక్తులతో కిటకిటలా డాయి. వివిధ పార్టీల ముఖ్య నాయకులు ప్రజలకు, కార్యకర్తలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

ఉప్పలగుప్తం, (ఆంధ్రజ్యోతి): దీపావళి వేడుకలు చిన్నారులు, యువత ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. సోమవారం వాతావరణం అనుకూలించడంతో ప్రజలు అత్యంత ఉత్సాహంగా పండుగను జరుపుకున్నారు. డీఎస్సీద్వారా ఉద్యోగాలు సాధించిన యువత రెట్టించిన ఉత్సాహంతో దీపావళి సంబరాల్లో పాల్గొన్నారు. విద్యుత్ దీపాలతో గృహాలను సర్వాంగ సుందరంగా అలంకరించారు. నూనె దీపాల వెలుగుల నడుమ మహిళలు లక్ష్మీపూజలు చేశారు. పలువురు ధన్వంతరికి పూజలు నిర్వహించారు.బాణసంచా కాల్పులతో గ్రామాల్లో సందడి నెలకొంది.

కాట్రేనికోన, (ఆంధ్రజ్యోతి): మండల వ్యాప్తంగా సోమవారం గ్రామగ్రామాన దీపావళిని ప్రజలు ఉత్సాహంగా జరుపుకున్నారు. వాతావరణం అంతగా అనుకూలించకపోయినా సంప్రదాయ ప్రకారం దీపకాంతులతో గ్రామాల్లో కొత్త వెలుగులు సంతరించుకున్నాయి. దేవాలయాల్లో దీపాలను వెలిగించి, పూజలు నిర్వహించారు. గతంతో పోలిస్తే బాణసంచా వినియోగం చాలా తక్కువగా జరిగింది. కాట్రేనికోనలో గ్రామదేవత మావుళ్ళమ్మ ఆలయం వద్ద ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దీపావళి వేడుకలు జరిగాయి.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): దీపావళి పండుగను ప్రజలు గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఇళ్లు, ఆలయాలను విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు లక్ష్మీదేవికి పూజలు నిర్వహించారు. చిన్నారులతో దివిటీలను కొట్టించారు. బాణాసంచా కాల్చారు.

గంగన్నస్వామికి 'డొక్కా సీతమ్మ' అవార్డు



అవార్డు స్వీకరిస్తున్న గంగన్నస్వామి

అమలాపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అపర అన్నపూర్ణగా చరిత్రకెక్కిన డొక్కా సీతమ్మ ఇన్సిరేషన్ పేరిట అవార్డును అమలాపురం మండలం జనుపల్లె గ్రామానికి చెందిన గోకరకొండ గంగన్నస్వామికి మంగళవారం ప్రదానం చేశారు. కాకినాడ జేఎన్‌టీయూ యూనివర్శిటీ వీసీ చాంబర్‌లో ఈఅవార్డును గంగన్నస్వామికి పాన్ ఇండియా సోషల్ కల్చర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫౌండర్ డాక్టర్ అద్దంకి రాజా, జేఎన్‌టీయూ వైస్‌చాన్స్‌లర్ సీఎస్ఆర్కే ప్రసాద్ అందజేశారు. అమలాపురం నల్లవంతెన ఎన్టీఆర్ మార్గ్‌లో అయ్యప్పస్వామి ఆలయాన్ని నిర్మించి ప్రతీ బుధవారం అయ్యప్పస్వామి పేరిట వందల మందికి కొన్నేళ్లుగా అన్నదానం చేస్తున్నారు. వీటితో పాటు స్వచ్ఛంద సేవా కార్యక్రమంలో పాల్గొంటూ సేవలందిస్తున్న గంగన్నస్వామి సేవలను గుర్తించి అవార్డును అందజేస్తున్నట్టు పాన్ ఇండియా సోషల్ కల్చరల్ అసోసియేషన్ ప్రకటించింది. ప్రస్తుతం గంగన్నస్వామి బీజేపీ కిసాన్‌మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడిగా పనిచేస్తూ రైతులకు సేవలు అందిస్తున్నారు. గంగన్నస్వామికి లభించడంపై పలువురు ఆయన్ను అభినందించారు.

కిమ్స్‌లో సీపీఆర్ అవగాహన వారోత్సవాల ముగింపు



సీపీఆర్‌పై వైద్య విద్యార్థులకు శిక్షణ

అమలాపురం రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): శ్వాస ఆగిపోయినప్పుడు సీపీఆర్ చేస్తే ఆ వ్యక్తి గుండె తిరిగి కొట్టుకుని బతికే అవకాశం ఉందని ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ హరికిరణ్ వర్మ తెలిపారు. మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆదేశాల మేరకు కిమ్స్ ఆసుపత్రిలో నిర్వహించిన సీపీఆర్ అవగాహన వారోత్సవాల సభకు కిమ్స్ డీన్ డాక్టర్ ఆనంద్‌ఆచార్య అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా సీపీఆర్ చేసే విధి విధానాలపై అవగాహన కల్పించారు. ఫిజికల్ కేర్ స్పెషలిస్టు డాక్టర్ శరణ్యాదేవి ఆధ్వర్యంలో ఐక్య విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. అమలాపురం ఎస్కేబీఆర్ కళాశాలలో 500మంది విద్యార్థులకు సీపీఆర్‌పై అవగాహన కల్పించినట్టు పారా మెడికల్ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఫరీద్‌బాబు తెలిపారు. ఫిజియోథెరపీ కళాశాలలో డాక్టర్ అశోక్‌చక్రవర్తి ఆధ్వర్యంలో, నర్సింగ్ కళాశాలలో స్వప్న, డెంటల్ కళాశాలలో డాక్టర్ సుమీత్‌శర్మ ఆధ్వర్యంలో సీపీఆర్ అవగాహన వారోత్సవాలు నిర్వహించారు. కిమ్స్ చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు), ఎండీ కె.రవికిరణ్‌వర్మ తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షం

మలికిపురం,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): వారం రోజుల నుంచి మండల పరిధిలో పలు ప్రాంతాల్లో కురుస్తున్న భారీవర్షానికి లోతట్టు ప్రాంతాలుజలమయం అవుతున్నాయి. పల్లపు ప్రాంతాల్లోని మురుగునీరు దిగక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. పూర్వపు మురికి బోదెలను మూసివేయడంతో ఈపరిస్థితి దాపురించిందని రైతులు అంటున్నారు.

ఇంటింటా అంబేడ్కర్ కార్యక్రమం

రాజోలు, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): దళిత చైతన్యవేదిక ఆధ్వర్యంలో ఇంటింటా అంబేడ్కర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వైస్ ఎంపీపీ పొలమూరి శ్యామ్‌బాబు అన్నారు. రాజోలు అంబేడ్కర్ భవనంలో దళిత చైతన్యవేదిక కార్యవర్గ సభ్యుల సమావేశం మట్టా సురేష్‌కుమార్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా నలంద ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ తాడి సత్యనారాయణ మాట్లాడుతూ ఇంటింటా అంబేడ్కర్ కార్యక్రమంద్వారా అంబేడ్కర్ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకువెళుతున్న బాధ్యతను తీసుకున్నందుకు దళిత చైతన్యవేదిక కార్యవర్గ సభ్యులను ఆయన అభినందించారు. ఇంటింటా అంబేడ్కర్ కార్యక్రమ కరపత్రాన్ని దళిత చైతన్యవేదిక కార్యవర్గ సభ్యుల సమక్షంలో శ్యామ్‌బాబు ఆవిష్కరించారు.దళిత చైతన్యవేదిక వ్యవస్థాపకుడు బత్తుల మురళీకృష్ణ, చింతా శ్రీనివాస్, లిఖితపూడి బుజ్జి, చిలకపాటి శ్రీధర్ పాల్గొన్నారు.

9న హాలో రజక.. చలో మామిడికుదురు

అమలాపురంటౌన్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): పవిత్ర కార్తీకమాసాన్ని పురస్కరించుకుని నవంబరు 9న హాలో రజక.. చలో మామిడికుదురు కార్యక్రమం చేపట్టినట్టు జిల్లా రజక సంఘ నాయకులు పేర్కొన్నారు. రజక ఐక్య కార్తీక వనసమారాధనకు అమలాపురం ఎంపీ గంటి హరీష్‌బాలయోగి, మంత్రి వాసంశెట్టి సుభాష్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. మంగళవారం అమలాపురంలో మంత్రి సుభాష్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్‌కుమార్, టీడీపీ సీనియర్ నాయకుడు గంధం పల్లంరాజు తదితరులను కలిసి ఆహ్వాన పత్రికలు అందజేశారు. రజకసంఘ నాయకులు అధికారపు వీరన్నబాబు, పసుపులేటి మహాలక్ష్మిరావు, కాట్రేనిపాడు నాగేంద్ర, గుడిమెళ్లంక కాశి, పసుపులేటి ధర్మారావు పాల్గొన్నారు.

ఆక్రమణలు తొలగించి రాకపోకలు పునరుద్ధరించాలి



ముమ్మిడివరంలో రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

ముమ్మిడివరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం ఆర్టీసీ బస్టాండులో ఆక్రమణలు తొలగించి బస్టాండులోకి బస్సుల రాకపోకలు పునరుద్ధరించాలని వామపక్ష, దళిత, విద్యార్థి, మహిళా, ప్రజాహక్కుల సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్ చేసింది. ముమ్మిడివరం సమైక్యాంధ్ర శిబిరంలో రాష్ట్ర కార్యదర్శి చీకురుమెల్లి రవికుమార్ రిలే నిరాహారా దీక్ష చేపట్టిన విషయం విదితమే. దీక్షా శిబిరంలో మంగళవారం సకిలే సూర్యనారాయణ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సీపీఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు,చీకురుమెల్లి రవికుమార్ మాట్లాడుతూ ఆర్టీసీ బస్టాండు ఆక్రమణలు తొలగించి బస్సుల రాకపోకలు పునరుద్ధరించాలన్నారు. ఆర్టీసీకి చెందిన రెండుఎకరాల 70సెంట్ల స్థలానికి సంబంధించి లీజును వెంటనే రద్దు చేయాలని, బస్టాండు ప్రాంతాన్ని ఆక్రమించిన లీజుదారుడిపై తక్షణమే క్రిమినల్ కేసు నమోదుచేసి చట్ట ప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు. అనంతరం బస్టాండు పరిరక్షణ పోరాట కమిటీ ఏర్పాటైంది. ప్రభుత్వం స్పందించకపోతే పోరాటం సాగిస్తామని హెచ్చరించారు. వివిధ ప్రజా సంఘాల నాయకులు గుత్తాల రమణ, కస్నీడి వెంకటరమణ, పందిరి శ్రీనివాసరావు, శెట్టిబత్తుల తులసీరావు, కప్పల సత్యనారాయణ, యలమించిలి బాలరాజు, బడుగు భీమేశ్వరం, నిమ్మకాయల వెంకటేష్, కమిడి శ్రీనివాస్, గుర్రాల రాంబాబు, గుత్తాల వరప్రసాద్, జనిపల్లి దుర్గాప్రసాద్, పండు అప్పలస్వామి, నల్లా రాంజీ, అరుణ్‌కుమార్, మెండి కృష్ణబాబు, పోతుల హేమసుందరనారాయణరావు పాల్గొన్నారు.

సేఫ్టీ ఐడీ స్టిక్కర్ల పంపిణీ

ఉప్పలగుప్తం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): లూయాస్ ఫొటోగ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశం మంగళవారం ఉప్పలగుప్తంలో జరిగింది. జిల్లా అసోసియేషన్ రూపొందించిన సేఫ్టీ ఐడీ స్టిక్కర్లను ఎస్ఐ సీహెచ్ రాజేష్ పంపిణీ చేశారు. స్టిక్కర్ క్యూఆర్ కోడ్ లింక్‌ను ఆయన ప్రారంభించారు. ఫోటోగ్రాఫర్లు ఈస్టిక్కర్లను వాహనాలకు అతికించుకోవాలని ఆయన సూచించారు. ఈఐడీ కార్డుద్వారా వెబ్‌సైట్‌లో మొత్తం సమాచారం నిక్షిప్తమై ఉండటంతో జిల్లాలోని ఫొటోగ్రాఫర్లందరికీ ఉపయోగపడుతుందన్నారు. ఈసాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చిన జిల్లా అధ్యక్షుడు గెద్దం సురేష్‌కు సమావేశంలో కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు దేవరపల్లి వెంకటేశ్వరరావు, జాన భవానీశంకర్‌పాల్గొన్నారు.

రహదారిపై విరిగిపడిన కొబ్బరి చెట్టు

ఉప్పలగుప్తం,అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం ఈదురుగాలులతో వర్షం కురిసింది. గాలులకు పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి.సరిపల్లి సెంటర్‌వద్ద అమలాపురం-చల్లపల్లి ఆర్అండ్‌బీ రహదారిపై ఒక కొబ్బరి చెట్టు విరిగిపడింది. ఆసమయంలో అటుగా వెళ్తున్న కూనవరం గ్రామానికి చెందిన సుందరనీడి శ్రీనివాసరావుకు గాయాలయ్యాయి. ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

ఆరో రోజుకు చేరిన నిరాహార దీక్షలు



పంచాయతీ కార్యాలయం వద్ద నిరాహార దీక్షలు

అమలాపురం రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): బండారులంకలో తక్షణం డంపింగ్ యార్డును ఏర్పాటుచేసి చెత్తను తొలగించాలని డిమాండ్ చేస్తూ గ్రామస్థులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి ఆరో రోజుకు చేరుకున్నాయి. బండారులంక పంచాయతీలో గ్రామసభ ఆమోదం పొంది తీర్మానం చేసిన స్థలంలో చెత్త వేయడాన్ని పలువురు ప్రశ్నించారు. జాన జగదీష్‌చంద్రగణేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో దీక్షలో గంటి కామేశ్వరరావు, కందనాల పుల్లయ్య, యినుమర్తి నాగేశ్వరరావు, బిళ్ల నందిసుబ్రహ్మణ్యం, బళ్ల శేఖర్, కామిశెట్టి వెంకటేశ్వరరావు, ములికి సాయి, ఊటుకూరి దిలీప్, ఏకుల సాంబమూర్తి తదితరులు దీక్షలో పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని గ్రామ పెద్దలు పేరి రాంబాబు, పేరి భానుమూర్తి, చందన శంకరరావు, గుత్తుల ఏసుబాబు, సరెళ్ల ఆమకృష్ణ, కామిశెట్టి శ్రీనివాసరావు, దంగేటి సత్తిపండు, చింతా ఉమామహేశ్వరరావు, కాలెపు శ్రీనివారావు, యినుమర్తి లింగమూర్తి, కారుపర్తి మల్లేశ్వరరావు తదితరులు సందర్శించి సంఘీభావం తెలిపారు.

వీరేశ్వరస్వామి ఆలయానికి కార్తీక శోభ

ఐ.పోలవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):మురమళ్ళ శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం కార్తీక శోభను సంతరించుకుంది. కార్తీకమాసం ప్రారంభం కావడంతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా విద్యుద్దీపాలతో అలంకరించారు. గోపురంపై మిరుమిట్లు గొలిపే విద్యుత్ సెట్టింగ్స్ ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద కార్తీకమాసం ఏర్పాట్లను ట్రస్టు బోర్డు చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పర్యవేక్షించారు. సోమవారాల్లో తగిన ఏర్పాట్లు చెయ్యాలని చైర్మన్ సూచించారు.



సూర్యచంద్రరావు ఆశయ సాధనకు కృషిచేస్తా



అమలాపురం టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జై ఆంధ్ర ఉద్యమ నాయకుడు, కాపు రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర కన్వీనర్ నల్లా సూర్యచంద్రరావు జయంతిని పురస్కరించుకుని మంగళవారం అమలాపురం పట్టణంలోని పలు వీధుల్లో ఉన్న విగ్రహాలకు కాపు నాయకులు పూలమాలలువేసి నివాళులర్పించారు. సూర్యచంద్రరావు ఆశయ సాధనకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ నల్లా విష్ణుమూర్తి, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్లా పవన్‌కుమార్, కాపునాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అబ్బిరెడ్డి సురేష్, నాయకులు దూడల ఫణి, ఆకుల ఈశ్వరరావు, అబ్బిరెడ్డి మూర్తి, పప్పొప్పుల తనీష్, గారపాటి బాలాజీ, తిక్కిరెడ్డి సురేష్, గుర్రాల రమేష్, సలాది నరేష్, అబ్బిరెడ్డి అరవింద్, సూర్యచంద్రరావు తనయులు నల్లా అజయ్, సంజయ్ పాల్గొన్నారు.

ఆర్ఎస్ఎస్ వందేళ్ల స్మారక నాణెం విడుదల



అమలాపురం టౌన్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా కోల్‌కతా టంకశాల రూ.100 స్మారక నాణేన్ని విడుదల చేసింది. స్వాతంత్ర్య భారత దేశ అభివృద్ధిలో ఆర్ఎస్ఎస్ పాత్ర చిరస్థాయిగా దేశ ప్రజల్లో ఉండేందుకు ఈనాణేన్ని విడుదల చేశారు. రూ.100 స్మారక నాణెంలో ఒక వైపు జాతీయ చిహ్నం ముఖ విలువ ఉంటే మరోవైపు సింహం, భారతమాత చిత్రానికి వందనం చేస్తున్న స్వయం సేవకులు ఉన్నారు. భారతీయ కరెన్సీ భరతమాత బొమ్మ కనిపించడం ఇదే తొలిసారి కావచ్చునని భూపయ్య అగ్రహారానికి చెందిన ప్రముఖ నాణేల సేకరణకర్త పుత్సా కృష్ణకామేశ్వర్ పేర్కొన్నారు. సంఘ్‌కు మార్గదర్శకంగా నిలిచిన 'రాష్ట్రీయ స్వాహా ఇదం రాష్ట్రాయ, ఇదం నమమ' అనే ఆదర్శ వాఖ్యం కూడా ఈ నాణెంలో చోటు చేసుకుంది. 40గ్రాముల పూర్తి వెండితో తయారుచేసిన ఈనాణెం 44 మిల్లీ మీటర్ల వ్యాసం కలిగి ఉంది. కోల్‌కతా టంకశాల నుంచి ఈనాణేన్ని రూ.8410కి కొనుగోలు చేసినట్టు కామేశ్వర్ తెలిపారు.

అప్పనపల్లిని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దాలి

మామిడికుదురు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అప్పనపల్లిని ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్ది, దేవస్థానానికి వచ్చే భక్తులకు ఏవిధమైన ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సూచించారు. దీపావళి పురస్కరించుకుని ప్రతీ సంవత్సరం దేవస్థానం సమకూర్చిన దుస్తులను సాధువులకు ఎమ్మెల్యే సోమవారం పంపిణీ చేశారు. తొలుత సూర్యభగవానుడికి బూరెలు సమర్పించి వాటిని భక్తులకు పంపిణీ చేశారు. దేవస్థానం ద్వారా దుస్తులు అందించడం అభినందనీయమన్నారు. ఏఎంసీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, జనసేన టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజా, మొల్లేటి శ్రీనివాస్, నాయకులు బోనం బాబు, తులా బ్రహ్మాజీ, మల్లాడి విష్ణు, సొసైటీ అధ్యక్షుడు మందా గాంధీ, కూటమి నాయకులు, సహాయ కమిషనర్ ఎం.సత్యనారాయణరాజు పాల్గొన్నారు.

16న కుమ్మరి శాలివాహన వనసమారాధన

అంబాజీపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): శాలివాహన సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన కార్యక్రమాన్ని వచ్చే నెల16న మాచవరంలోని సంఘ భవనంలో నిర్వహిస్తామని సంఘ నాయకులు తెలిపారు. స్థానిక సంఘ భవనంలో సంఘ కార్యదర్శి దాలపర్తి భీమేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం జరిగిన సమావేశంలో నాయకులు మాట్లాడారు. వనసమారాధనకు జిల్లాల్లోని సంఘీయులంతా హాజరై విజయవంతం చేయాలని కోరారు. నాయకులు మానేపల్లి వీరబ్రహ్మం, వెల్లా త్రిమూర్తులు, దొడ్డిపట్ల శ్రీనివాస్, మంతెన శ్రీనివాస్, ఆదుర్తి నారాయణమూర్తి పాల్గొన్నారు.

అన్నదానం

అంబాజీపేట, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): జనసేన నాయకుడు, అటవీశాఖ ఐటీ ప్రాజెక్టు అడ్వయిజర్ పెన్నమరెడ్డి నాగబాబు జన్మదిన వేడుకలను మంగళవారం అంబాజీపేటలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా షిరిడి సాయిబాబా నిత్యాన్నదాన సత్రంలో జనసేన నాయకుడు షైపాల తాతాజీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కొమ్ముల బాబి, నందెపు శ్రీను, సుదాబత్తుల రవి, రవణం విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బీవీ రమణయ్య వర్ధంతి

ముమ్మిడివరం, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి) రిపబ్లికన్ పార్టీ మాజీ ఎమ్మెల్యే బి.వి.రమణయ్య వర్ధంతిని అంబేడ్కర్ మెమోరియల్ సొసైటీ, ఇతర అభ్యుదయ సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. పోలమ్మ చెరువు గట్టున జైబుద్ధ పార్కులో బుద్ధుడి విగ్రహం వద్ద జ్యోతి వెలిగించి బుద్ధ వందనం చేశారు.రమణ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. న్యాయవాదిగా, ఎమ్మెల్యేగా చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వడ్డి నాగేశ్వరరావు, దాసరి రమణ, దొనిపాటి ఆంజనేయులు, డి.వి.చక్రవర్తి, యడ్ల చిట్టిబాబు, జేఎల్‌వీ ప్రసాద్, కాశి వెంకటాచారి, పెయ్యల విఘ్నేశ్వరరావు, మెండు కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

పురమిత్ర యాప్‌పై అవగాహన కల్పించాలి

ముమ్మిడివరం, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): పురమిత్రయాప్ ద్వారా అందించే సేవలను ప్రజలకు పూర్తిస్థాయిలో వివరించాలని నగర కమిషనర్ పి.రవివర్మ సూచించారు. నగర పంచాయతీ కార్యాలయంలో మంగళవారం డ్వాక్రా రీసోర్స్‌పర్సన్లకు పురమిత్ర యాప్‌పై సమీక్ష నిర్వహించారు. ప్రజలకు అవసరమైన సేవలు పురమిత్ర యాప్ ద్వారా అందుతాయని, ప్రజలు యాప్‌ను అప్‌లోడు చేసుకోవాలన్నారు. సిటీ మిషన్ మేనేజర్ సోమాని భాస్కర్, సివో కోఆర్డినేటర్ ఏ.దేవకిదేవి, ఆర్పీలు, డీజీ లక్ష్మి పాల్గొన్నారు.

శెట్టిబలిజ కల్యాణ మండపానికి నిధులు మంజూరు చేయాలి

ముమ్మిడివరం/ఐ.పోలవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరంలో శెట్టిబలిజ కల్యాణ మండపానికి నిధులు మంజూరు చేయాలని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నర్సాపురం నియోజకవర్గ పరిశీలకుడు గుత్తుల సాయి ఆధ్వర్యంలో శెట్టిబలి జ సామాజిక వర్గీయులు కోరారు. మంగళవారం వారు ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజును కలిసి వినతిపత్రం అందించారు. ఎమ్మెల్యే సుబ్బరాజు సానుకూలంగా స్పందించి నిధులు సమకూరుస్తానని హామీ ఇచ్చారు. గతంలో కూడా శెట్టిబలిజలపై ఉన్న అభిమానంతో ముమ్మిడివరం శెట్టిబలిజ కల్యాణ మండపానికి, దొమ్మేటివారిపాలెం శెట్టిబలిజ కల్యాణ మండపానికి రూ.5లక్షల చొప్పున ఇచ్చానని ఎమ్మెల్యే వివరించారు. అనంతరం టీడీపీ యువనాయుడు దాట్ల పృథ్వీరాజ్‌ను కూడా కలిసి నిధులు మంజూరు విషయమై ఆయన్ను కూడా కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన శెట్టిబలిజ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరంలో రూ.2కోట్లతో అభివృద్ధి పనులు



ప్రభుత్వ డిగ్రీ కళాశాల స్థలాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు

ముమ్మిడివరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నగర పంచాయతీ పరిధిలోరూ.2కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు తెలిపారు. రూ.కోటిఓఎన్జీసీ సీఎస్ఆర్ నిధులతో పోలమ్మ చెరువు గట్టుపై వాకింగ్ ట్రాక్, రూ.కోటి కెనరా బ్యాంకు సీఎస్ఆర్ నిధులతో డిగ్రీ కళాశాల నిర్మిస్తున్నట్టు తెలిపారు. మంగళవారం వాకింగ్ ట్రాక్ నిర్మించే పోలమ్మ చెరువు గట్టు, డిగ్రీ కళాశాల నిర్మించే స్థలాలను అధికారులతో ఆయన పరిశీలించారు. నాయకులు గుత్తుల సాయి. దాట్ల బుజ్జి, ములపర్తి బాలకృష్ణ, దాట్ల వర్మ, కాకర్లపూడి రాజేష్, దొమ్మేటి రమణకుమార్ దాట్ల బాబు, విళ్ల వీరాస్వామి నాయుడు, పాయసం చిన్ని, కమిషనర్ రవివర్మ, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

రోడ్డుకు అడ్డంగా భారీ వాహనం



మలికిపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): లక్కవరం నాలుగు రోడ్ల జంక్షన్‌లో ఓఎన్జీసీ భారీ వాహనం బట్టేలంక వైపు వెళ్లే వంతెనపై తిరగలేక మధ్యలో ఏపీ166822 నంబరు గల వాహనం రోడ్డుకు అడ్డంగా మంగళవారం ఉదయం నుంచి నిలిచిపోయింది. ఆర్టీసీ బస్సులను వేరే మార్గంలో తిప్పుతున్నారు. ఇతర వాహనాలు వేరే మార్గంలో తిరగడంలో ఇబ్బందులకు గురయ్యారు. భారీ వాహనాన్ని తొలగించేందుకు ఓఎన్జీసీ భారీ క్రేన్‌ను ఉపయోగించి పనులు ప్రారంభించారు. భారీ వాహనాలు వెళ్లడానికి ఓఎన్జీసీ వంతెనలు నిర్మించకుండానే పాత వంతెనలపై తిప్పుతున్నారు. దీంతో వంతెనలు కూలిపోయే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఓఎన్జీసీ ఈ ప్రాంతంలో గల ముడి సరుకును ఇతర ప్రాంతాలకు తరలించుకుపోతున్నారు తప్ప ఈప్రాంతంపై శ్రద్ధ వహించడం లేదని పీసీసీ మెంబరు రుద్రరాజు గోపాలకృష్ణంరాజు ఆరోపించారు. ఈప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని ఒక ప్రకటనలో కోరారు.

అమ్మవారి ఉత్సవాలకు ముహూర్తం ఖరారు

అంతర్వేది, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కేశవదాసుపాలెం-అంతర్వేది సరిహద్దు ప్రాంతంలో వెలసి ఉన్న శ్రీకనకముత్యాలమ్మ, కనకదుర్గమ్మవార్ల ఉత్సవాల ముహూర్తం ఖరారుచేశారు. ఈసందర్భంగా అమ్మవారికి సముద్ర స్నానం ఆచరింపచేసి గ్రామోత్సవం నిర్వహించారు. డిసెంబరు మొదటివారంలో జరిగే శ్రీకనకముత్యాలమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ముందస్తుగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో కుంకుమ పూజలు చేశారు.

'జీవోలను సవరించాలి'

ముమ్మిడివరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన అసంబద్ధమైన 60, 61 జీవోలను సవరించాలని టీచర్స్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఎస్ఎస్.మునేశ్వరరావు,కార్యదర్శి యు.వెంకట్రావు డిమాండ్ చేశారు. ఉద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న నాలుగు డీఏల్లో ఒక డీఏను ప్రభుత్వం ప్రకటించినా సంతోషం లేకుండానే ఈజీవోలతో ఆవిరైపోయిందన్నారు. బకాయిలు ఉద్యోగ విరమణ తరువాత ఇస్తామని చెప్పడం ఉద్యోగులను మోసం చేయడమేనని, ప్రభుత్వం ఎన్నో రకాల ఖర్చులు చేస్తున్నా ఉద్యోగుల వద్దకు వచ్చేసరికి నిధుల కొరతని పేర్కొనడం విడ్డూరంగా ఉందన్నారు. ఈప్రభుత్వం తక్షణమే ఈజీవోలను సవరించి ఉద్యోగ, ఉపాధ్యాయులకు రావాలసిన డీఏ బకాయిలు, పీఎఫ్ ఖాతాలో జమ చేయాలని సీపీఎస్ ఉద్యోగులకు నగదు రూపంలో చెల్లించాలని, ఉద్యోగ విరమణ చేసిన ఉపాధ్యాయులకులకు ఏకమొత్తంగా చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఉద్యోగ విరమణ తరువాత డీఏ బకాయిలు చెల్లిస్తారా!

అమలాపురం రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ అనంతరం బకాయిలు చెల్లిస్తారా అని ఎస్టీయూ, యూటీఎఫ్ జిల్లాశాఖ ప్రతినిధులు తీవ్రంగా విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రకటించిన డీఏ 3.64శాతానికి సంబంధించి విడుదల చేసిన జీవో నంబరు 60,61లను వెంటనే సవరించాలని ఎస్టీయూ జిల్లాశాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, ప్రధాన కార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు, ఆర్థిక కార్యదర్శి నేరేడుమిల్లి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఉద్యోగ, ఉపాధ్యాయులు మరో ధర్నాకు దారి చూపకుండా చూడాలన్నారు. సీపీఎస్ ఉద్యోగులకు తీవ్ర నిరాశ కలిగించిందని విమర్శించారు. ఇక ఉద్యోగ, ఉపాధ్యాయులు భవిష్యత్తు ఉద్యమాలకు సన్నద్ధం కావాలని యూటీఎఫ్ జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన్య కార్యదర్శులు పి.సురేంద్రకుమార్, మేడిచర్ల టీవీఎస్ సుబ్బారావు డిమాండ్ చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవోల వల్ల ఉద్యోగులు తీవ్రంగా నష్టపోతారని విమర్శించారు. భవిష్యత్తులో సకాలంలో ప్రభుత్వ ఉద్యోగులకు డీఏ చెల్లించకుండా తాత్సారంచేసే పరిస్థితులు ఏర్పడ్డాయని విమర్శించారు. భవిష్యత్తు ఉద్యమాలకు ఉద్యోగులు, ఉపాధ్యాయులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు.

నీటి వృథాను అరికట్టాలి



మామిడికుదురు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మామిడికుదురులోని కొర్లగుంటకు వెళ్లే దారిలో గల ప్రధాన పంటకాల్వ వద్ద తాగునీటిని పంపిణీ చేసే పైపులైనుకు ఏర్పడిన రంధ్రానికి మరమ్మతులుచేసి నీటి వృథాను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు. పైపులైను దెబ్బతినడం వల్ల తాగునీరు వృథాగా పంట కాల్వకు వెళుతుందని, మూడు నెలలుగా ఈవిధంగా తాగునీరు వృథా అవుతున్నా సంబంధిత అధికారులు సమస్యలు పరిష్కరించకుండా తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై అధికారులు తక్షణమే స్పందించి పైపులైనుకు మరమ్మతులు నిర్వహించి వృథాను అరికట్టి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

మండపేట

• కొత్తపేట • మండపేట • రామచంద్రపురం

కార్తీకమాసం పూజలకు శైవక్షేత్రాలు ముస్తాబు



ప్రత్యేక అలంకరణలో సోమేశ్వరస్వామి

రాయవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో శైవక్షేత్రాలుగా పేరొందిన సోమేశ్వరం బాలాత్రిపుర సుందరి సమేత సోమేశ్వర స్వామి, వెంటూరు ఉమా సోమేశ్వరస్వామి ఆలయాలు కార్తీకమాసం పూజలకు ముస్తాబవుతున్నాయి. వెంటూరు పార్వతి సోమేశ్వర స్వామి ఆలయంతో పాటు సోమేశ్వరస్వామి ఆలయాల్లో నెలరోజులపాటు పూజలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. రాయవరం అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వరస్వామి, రాయవరం రాజేశ్వరస్వామి, లొల్ల రామ లింగేశ్వరస్వామి, చెల్లూరు అగస్తేశ్వరస్వామి, పసలపూడి రాజేశ్వరస్వామి, వెదురుపాక పార్వతి సోమేశ్వరస్వామి, మాచవరం శివాలయాల్లో కార్తీకమాసాన్ని పురస్కరించుకుని అభిషేకాలు, అర్చనలు, బిల్వార్చనలు, దీపోత్సవాలు జరిపేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మండలంలోని ఉన్న శివాలయాల్లో బుధవారం నుంచి కార్తీక శోభ నెలకొననుంది.

నియోజకవర్గ అభివృద్ధికి సహకరించండి

ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు వినతి

కొత్తపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కొత్తపేట నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసి సహకరించాలని మంగళవారం అమరావతిలో ముఖ్యమంత్రి చంద్రబాబును కలిసి కోరారు. ముఖ్యంగా సెంట్రల్ డెల్టాకు ఆయువుపట్టు అయిన లొల్లలాకుల పునర్నిర్మాణం, కొత్తపేట ఆర్డీవో కార్యాలయంతో పాటు, డివిజనల్, తహసీల్దారు కార్యాలయాల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయాలన్నారు. కొన్ని భవనాల నిర్మాణానికి మార్కెట్ యార్డు స్థలాన్ని కేటాయించాలని కోరారు. రావులపాలెం జాతీయ రహదారి నుంచి వాడపల్లి వరకూ ఏటిగట్టు నిర్మాణం చేపట్టాలని ఆయన కోరారు. వీటన్నింటిపై ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించారని ఎమ్మెల్యే తెలిపారు.

వృత్తి నైపుణ్య శిక్షణతో మహిళలకు స్వయం ఉపాధి



మహిళకు సర్టిఫికెట్ పంపిణీ చేస్తున్న మంత్రి సుభాష్

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): వృత్తి నైపుణ్య శిక్షణతో మహిళలకు స్వయం ఉపాధికి బాటలు వేస్తున్నామని మంత్రి సుభాష్ అన్నారు. సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జ్యూట్ బ్యాగుల శిక్షణ, చేనేత మగ్గం వర్కు శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు స్థానిక జూనియర్ కళాశాలలో సర్టిఫికెట్లు, టూల్‌కిట్లు మంత్రితో పాటు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, రూరల్ సెల్ఫ్ ఎంప్లాయిమెంటు ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ తాడి శ్రీనివాస్, డైరెక్టర్ జయ తదితరులు పాల్గొన్నారు.

ద్వారపూడిలోకి బస్సులు రావడం లేదంటూ ఆందోళన

మండపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ద్వారపూడికి ఆర్టీసీ బస్సులు రావడం లేదంటూ మంగళవారం గ్రామానికి చెందిన ప్రజలతో పాటు కూటమి నాయకులు రోడెక్కి ఆందోళనకు దిగారు. ద్వారపూడి గ్రామానికి రాజమండ్రి, కాకినాడ, రావులపాలెం డిపోల బస్సులు గ్రామంలోకి రాకుండా వంతెన పైనుంచి వెళ్లిపోతున్నాయని స్థానికులు ఆరోపించారు. స్థానికుల ఆందోళన నేపథ్యంలో మూడు గంటలపాటు ఆర్టీసీ బస్సులు వంతెనకు రెండు వైపులా నిలిచిపోయాయి. మండపేట రూరల్ ఎస్ఐ కిషోర్‌తోపాటు రాజమండ్రి ఆర్టీసీ సిబ్బంది చేరుకుని గ్రామస్థులతో పాటు స్థానిక నాయకులతో చర్చలు జరిపారు. ఆర్టీసీ ఉన్నతాధికారులతో మాట్లాడి గ్రామంలోకి బస్సులు నడిచేలా చర్యలు తీసుకుంటామని చెప్పడంతో వారు ఆందోళన విరమించారు. కూటమి నాయకులు పల్లా సన్యాసిరావు (బాబు), అడబాల వెంకట్రాజు(బుల్లబ్బు), పల్ల బాబు, కంకటాల మురళీకృష్ణ, సూరిబాబులపై కేసు నమోదు చేశామని రూరల్ ఎస్ఐ వి.కిషోర్ తెలిపారు.



ఆందోళన చేస్తున్న వారితో చర్చలు జరుపుతున్న రూరల్ ఎస్ఐ

టిడ్కో గృహాలు ఫేజ్2 పనులు వేగవంతం చేయాలి

మండపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గొల్లపుంత టిడ్కో కాలనీలో ఫేజ్2లో ఇళ్ల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని అధికారులను మండపేట మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు కోరారు. మండపేటలో మంగళవారం ఆయన టిడ్కో అధికారులతో పాటు మున్సిపల్ విభాగంలో వివిధ శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. పురపాలకశాఖ మంత్రి పి.నారాయణ ఆదేశాల మేరకు బ్యాంకు రుణాలు పెండింగ్‌లో వున్న టిడ్కోగృహాల రిజిస్ట్రేషన్‌తోపాటు మార్టిగేజ్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. సమావేశంలో మున్సిపల్ డీఈఈ శ్రీనివాసరావు, పట్టణ ప్రణాళిక విభాగపు అధికారి రమ్య, మున్సిపల్ ఏఈలు అనూష, పవన్, టిడ్కో సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్న ఆలయ అభివృద్ధిపై మంత్రి, కమిషనర్‌తో చర్చ

ఆత్రేయపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధి పనులపై రాష్ట్ర దేవాదాయ శాఖా మంత్రి ఆనం రామానారాయణరెడ్డి, కమిషనరు కె.రామచంద్రమోహన్‌తో మంగళవారం అమరావతిలోని వారి కార్యాలయాల్లో కొత్తపేట ఎమ్మెల్యే బండారు అభివృద్ధి పనులను వివరించారు. ప్రతి శనివారం పెరుగుతున్న భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని చేపట్టాల్సిన అభివృద్ధి పనులను మంత్రి, కమిషనర్‌తో ఎమ్మెల్యే చర్చించారు. భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించాలనే లక్ష్యంతో రూపొందించిన ప్రతిపాదనలను త్వరితగతిన చేపట్టాలని కోరారు. చైర్మన్ ముదునూరి వెంకట్రాజు, ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు పాల్గొన్నారు. తొలుత మంత్రిని కలిసి స్వామివారి శేషవస్త్రం, ప్రసాదాలను అందించారు.

డీఏ పెంపుపై హర్షం

కె.గంగవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): డీఏ పెంచుతూ జీవో జారీ చేయడంపై పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు నరాల కృష్ణకుమార్ హర్షం వ్యక్తం చేశారు. జీవో 60, 61లను సవరణ చేసి ఉద్యోగుల డీఏ ఏరియర్స్‌ను వారి పీఎఫ్ ఖాతాలకు, సీపీఎస్ ఉద్యోగులకు, పెన్షనర్లకు నగదు రూపంలో చెల్లించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

అంబరాన్నంటిన దీపావళి సంబరాలు

దీపావళి పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఊరు, వాడ ఆనందోత్సాహాల మధ్య అట్టహాసంగా దీపావళిని జరుపుకున్నారు. ఇళ్లన్నీ దీపాల వెలుగులతో కళకళలాడగా, ఆయా ప్రాంతాలు బాణసంచా కాల్పులతో హోరెత్తాయి



ఆత్రేయపురం మండలం వాడపల్లి ఆలయంలో నరకాసుర వధ నిర్వహిస్తున్న దృశ్యం

ఆలమూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలో దీపావళి సంబరాలు అంబరాన్నంటాయి. మండలంలో సోమవారం దీపావళి సందర్భంగా ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. చిన్నారులు, పెద్దలు అనే తేడా లేకుండా బాణసంచా కాలుస్తూ ఉత్సాహంగా గడిపారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టడంతో దీపావళి వేడుకలు ప్రశాంతంగా జరిగాయి.

వాడపల్లిలో నరకాసురుడి వధ

ఆత్రేయపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం రాత్రి నరకాసురుడి వధ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం దీపాలు వెలిగించి బాణసంచా కాల్చారు. స్వామివారు తిరువీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. మంగళవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధరరావు ఏర్పాట్లు నిర్వహించారు.

సహస్ర దీపాలతో స్వచ్ఛాంధ్ర

దీపావళి సందర్భంగా సోమవారం ర్యాలి శ్యామ్ జాదుగర్ మ్యాజిక్ ఫ్యామిలి ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర.. స్వచ్ఛత హీ నినాదంతో దీపావళి వేడుకలు నిర్వహించారు. సహస్ర దీపాలతో స్వచ్ఛాంధ్ర అక్షర రూపంలో జ్యోతులను వెలిగించి స్వచ్ఛాంధ్ర ప్రచారానికి శ్రీకారం చుట్టారు. వృద్ధులు, చిన్నారులు బాణసంచా కాలుస్తూ సందడి చేశారు.

భక్తి శ్రద్ధలతో లక్ష్మీదేవి పూజలు

కె.గంగవరం (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం దీపావళి పండుగను ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఆయా ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. సాయంత్రం లక్ష్మీదేవి పూజను భక్తిశ్రద్ధలతో జరిపారు. పిల్లలు దివిటీలు కొట్టిన అనంతరం బాణసంచా కాల్చారు.

మండపేట (ఆంధ్రజ్యోతి): మండలంలో దీపావళి పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఇళ్లన్నీ దీపాల వెలుగులతో కళకళలాడాయి. నూనె దీపాలతో పాటు విద్యుత్ వెలుగులతో ఆలయాలు, ఇళ్లను అందంగా అలంకరించారు. చిన్నారులు, పెద్దలు బాణసంచా కాల్పుల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు.

కొత్తపేట (ఆంధ్రజ్యోతి): మండలంలో దీపావళి వేడుకలు అంబరాన్నంటాయి. సోమవారం సాయంత్రం లక్ష్మీపూజ అనంతరం దివిటీలను కొట్టి పండుగను ప్రారంభించారు. చిన్నారులు, పెద్దలు బాణసంచా కాలుస్తూ సందడి చేశారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, అనంతకుమారి దంపతులు బాణసంచా కాలుస్తూ వేడుకలు నిర్వహించారు.

కొత్తపేట (ఆంధ్రజ్యోతి): దీపావళి తర్వాత మిగిలిన బాణసంచా నిల్వలను ఇంట్లో పెట్టుకోవద్దని కొత్తపేట డీఎస్పీ సుంకర మురళీమోహన్ సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ దీపావళి తరువాత ఇళ్లలో ఎవ్వరైనా మందుగుండు సామగ్రిని నిల్వ చేస్తే వాటిని సీజ్ చేయడంతో పాటు కేసులు నమోదు చేస్తామని డీఎస్పీ హెచ్చరించారు.

రాయవరం (ఆంధ్రజ్యోతి): మండలంలో దీపావళి వేడుకలను సోమవారం రాత్రి ఉత్సాహంగా జరుపుకున్నారు. వెదురుపాక విజయదుర్గా పీఠంలో అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు జరిపారు. ధనలక్ష్మి అమ్మవారికి గాడ్ కుమార్తెలు రమ, సత్యవెంకట కామేశ్వరి, సత్యకనకదుర్గ ప్రత్యేక పూజలు చేశారు. పీఠంలో భక్తులతో సామూహిక ధనలక్ష్మి పూజలు జరిపించారు. అనంతరం భక్తులకు అమ్మవారి దర్శనాలు కల్పించి మహాలక్ష్మి అమ్మవారికి పూజలు చేసిన నాణేలను భక్తులకు అందజేశారు. మండలంలో ఆయా గ్రామాల్లో దీపావళి పండుగను ఘనంగా జరుపుకున్నారు.



కొత్తపేటలో దీపావళిని జరుపుకుంటున్న టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు రెడ్డి సుబ్రహ్మణ్యం, జిల్లా అధ్యక్షురాలు అనంతకుమారి



ఆత్రేయపురం: వాడపల్లిలో స్వామివారి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

రావులపాలెం (ఆంధ్రజ్యోతి): మండలంలో దీపావళి పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం సాయంత్రం 6 గంటల తర్వాత చిన్నారులతో దివిటీలు కొట్టించి పండుగను ప్రారంభించారు. చిన్నారులు, పెద్దలు బాణసంచా కాలుస్తూ వేడుకలు జరిపారు.

సత్యసాయి సేవా కేంద్రంలో పిడతల పూజ: దీపావళిని పురస్కరించుకుని రావులపాలెంలోని సత్యసాయి సేవా కేంద్రంలో లక్ష్మీదేవికి పిడతల పూజ నిర్వహించారు. తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వేద పండితులు పెదసనగంటి సీతారామశర్మ ఆధ్వర్యంలో లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పిడతల్లో అటుకులు, బెల్లం అమ్మవారికి నైవేద్యంగా సమర్పించగా, చిన్నారులు పూజల్లో పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం (ఆంధ్రజ్యోతి): మండలంలో దీపావళి పండుగను సోమవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మీదేవికి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఇళ్ల వద్ద ప్రమిదలతో అలంకరించారు. చిన్నా, పెద్ద తారతమ్యం లేకుండా బాణాసంచా కాల్చారు.

ఆస్ట్రేలియాలో లోకేష్‌కు స్వాగతం

ఆత్రేయపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన మంత్రి లోకేష్‌కు వద్దిపర్రుకు చెందిన మెల్‌బోర్న్ ఎన్ఆర్ఐ టీడీపీ అధ్యక్షుడు కిషోర్ బలుసు అధ్వర్యంలో ఎన్ఆర్ఐలు స్వాగతం పలికారు. స్పెషల్ విజిట్ నిమిత్తం మెల్‌బోర్న్ వెళ్లిన మంత్రికి అక్కడ టీడీపీ ఎన్ఆర్ఐలు పార్టీ తరఫున స్వాగతం పలికినట్టు మెల్‌బోర్న్ టీడీపీ అధ్యక్షుడు కిషోర్ ఆత్రేయపురం మీడియా ప్రతినిధులకు తెలిపారు. మంత్రి లోకేష్‌కు మెల్‌బోర్న్ టీడీపీ ప్రతినిధులు నరేంద్ర. కె, రవితేజ. కె, తన్మయి ఈదర, నవీన్ మద్దినేని తదితరులు స్వాగతం కార్యక్రమంలో పాల్గొన్నట్టు కిషోర్ వివరించారు.

పుంగనూరు బుల్లిదూడ జననం

ఆలమూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గుమ్మిలేరులో పుంగనూరు ఆవుకు బుల్లి పెయ్యిదూడ జన్మించింది. పుంగనూరు ఆవుల పెంపకంలో గుర్తింపు పొందిన రెడ్డి సత్తిబాబు మాకంలోని ఆవుకు తక్కువ ఎత్తు (12అంగుళాలు)తో పుట్టిన దూడను రైతులు ఆసక్తిగా తిలకించారు. సాధారణంగా పుంగనూరు దూడలు 15 నుంచి 18 అంగుళాల ఎత్తులో జన్మిస్తుంటాయి. ఈ దూడ కేవలం 12 అంగుళాల ఎత్తుతో పుట్టినట్లు రైతు సత్తిబాబు తెలిపారు.

పురసేవ యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పించండి

కమిషనర్ టీవీ రంగారావు

మండపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజలకు పురసేవ యాప్‌పై అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ టీవీ రంగారావు మున్సిపల్ సచివాలయ ఉద్యోగులను కోరారు. మండపేట మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ సచివాలయ ఉద్యోగులతో ఆయన పురసేవ యాప్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ యాప్ వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలకు అవగాన కల్పించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ డిఈఈ శ్రీనువాస్, ఏఈలు అనూష, పవన్, పలు విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.



అంగరలో ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న జయరాజు మాదిగ

బాణసంచా బాధితులకు న్యాయం చేయాలి

కపిలేశ్వరపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అంగర గాంధీ సెంటర్‌లో ఎంఆర్పీఎస్, వామపక్షాల ఆధ్వర్యంలో రాయవరం ఘటనలో మృతి చెందిన బాధిత కుటుంబాలకు తక్షణమే ఎక్స్‌గ్రేషియా ప్రకటించి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ధర్నా జరిపారు. ఈ ధర్నానుద్దేశించి ఎంఆర్పీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు ధూళి జయరాజు మాదిగ, ప్రజానాట్య మండలి రాష్ట్ర కన్వీనర్ వేమగిరి శ్యామన్న ముఖ్య అతిథులుగా పాల్గొని మాట్లాడారు. ఈ ఘటన జరిగి 14 రోజులు అయినప్పటికీ బాధితులకు ఎలాంటి సాయం అందలేదని విమర్శించారు. బాధిత కుటుంబాలను ఆదుకునేలా ప్రభుత్వం నుంచి ప్రకటన రాకుంటే కార్మికశాఖ మంత్రి ఇంటిని ముట్టడిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంఆర్పీఎస్ నాయకులు ఎం.దావీదుమాదిగ, మాదిగ యువసేన నాయకులు ఏసు మాదిగ, సీపీఐ నాయకులు ఎస్.బాబు, సీహెచ్ నాగేంద్రప్రసాద్, ఎల్.కామేశ్వరరావు, కె.రామకృష్ణ, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్, అధిక సంఖ్యలో ఎంఆర్పీఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆలమూరు ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారిని తాకిన సూర్య కిరణాలు

ఆంజనేయస్వామిపై సూర్యకిరణాలు

ఆలమూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మెయిన్ రోడ్డులో ఉన్న భక్తాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం కార్తీకమాసం ప్రారంభం రోజున స్వామివారిపై సూర్య కిరణాలుపడ్డాయి. ఈ దృశ్యాన్ని భక్తులు తిలకించి తన్మయత్నం చెందారు. ఆలయ అర్చక స్వాములు కాళ్లకూరి సూరిపండు అధ్వర్యంలో పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు కొండూరి మాణిక్యాలరావు దంపతులతోపాటు కమిటీ సభ్యులు, భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేశారు. స్వామి వారిపైకి సూర్యకిరణాలు రావడం అరుదైన ఘటన అని అన్నారు. ఏడాదిలో ఇటువంటి ఘటనలు కొద్దిరోజులు మాత్రమే జరుగుతుందని అర్చకుడు సూరిపండు తెలిపారు.

నూకాంబిక ఆలయంలో చండీహోమం



చండీహోమంలో ద్రవ్యాలు వేస్తున్న భక్తులు

ఆలమూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): చింతలూరు నూకాంబిక అమ్మవారి ఆలయంలో అమావాస్య సందర్భంగా చండీ హోమం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో కార్యనిర్వహణాధికారి వుండవల్లి వీర్రాజుచౌదరి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చండీ హోమాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా జరిపించారు. ఈ హోమంలో పాల్గొనడానికి భక్తజనం తరలి వచ్చారు. హోమంలో భక్తులు తీసుకొచ్చిన ద్రవ్యాలను వేసి భక్తితో పూజించారు. అనంతరం నూకాంబిక అమ్మవారి దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ వీరి అప్పారావుతోపాటు పలువురు సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

భక్తుల స్నానాలకు అనుగుణంగా ఏర్పాట్లు

ఆత్రేయపురం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నేటి నుంచి కార్తీకమాసం ప్రారంభం కావడంతో ఆయా గ్రామాల్లోని పుష్కరఘాట్లు, రేవులను శుభ్రం చేస్తున్నారు. వాడపల్లి, వద్దిపర్రు, పుష్కరఘాట్లలలో పేరుకుపోయిన మట్టిని తొలగించి స్నానాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నారు. నీటి సంఘం అధ్యక్షుడు జుజ్జవరపు హరిబాబు దగ్గరుండి వాటి పనులను పర్యవేక్షించారు.

ఆలయ అభివృద్ధికి, అర్చకుడికి ఆర్థికసాయం

ద్రాక్షారామ, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రామచంద్రపురం మండలం కాపవరం షిర్డీ సాయిబాబా ఆలయ అభివృద్ధికి మంత్రి సుభాష్ రూ.50 వేల ఆర్థికసాయం అందచేశారు. గ్రామంలోని భద్రకాళి సమేత వీరేశ్వరస్వామి ఆలయం అర్చకుడు భద్రిరాజుకు రూ.10 వేలు, ఆలయ స్వీపరు నరాల కాశీవిశ్వనాధంకు రూ.10వేలు ఆర్థికసాయం అందచేశారు. అంతకు ముందు వీరేశ్వరస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

మారేడుబాక కార్యదర్శికి డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి



మండపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి) మారేడుబాక పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న బూసి ప్రసాద్‌బాబుకు డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి వచ్చిందని మండపేట మండల అభివృద్ధి అధికారి సత్యనారాయణ మూర్తి తెలిపారు. ఆయనకు ప్రభుత్వం పదోన్నతి కల్పించి కపిలేశ్వరపురం మండల డిప్యూటీ ఎంపీడీవోగా నియమించిందని ఆయన తెలిపారు. పదోన్నతి పొందిన ప్రసాద్ బాబును మండపేట మండల డిప్యూటీ ఎంపీడీవో దాసరి శ్రీనువాస్, సహచర ఉద్యోగులు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు అభినందించారు.

వీరేశ్వరస్వామి ఆలయానికి కార్తీక శోభ

ఐ.పోలవరం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం కార్తీక శోభను సంతరించుకుంది. కార్తీకమాసం ప్రారంభం కావడంతో ఆలయాన్ని సర్వాంగ సుందరంగా విద్యుద్దీపాలతో అలంకరించారు. గోపురంపై మిరుమిట్లు గొలిపే విద్యుత్ సెట్టింగ్స్ ఏర్పాటు చేశారు. ఆలయం వద్ద కార్తీకమాసం ఏర్పాట్లను ట్రస్టు బోర్డు చైర్మన్ దాట్ల రామకృష్ణంరాజు, అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ పర్యవేక్షించారు. సోమవారాల్లో తగిన ఏర్పాట్లు చెయ్యాలని చైర్మన్ సూచించారు.

తోరాటి సేవలు చిరస్మరణీయం



కపిలేశ్వరపురం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగరలో కామ్రేడ్ తోరాటి లక్ష్మణమూర్తి వర్ధంతిని మంగళవారం యూటీఎఫ్ మండలశాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు పి. సురేంద్రకుమార్, మండల ప్రధాన కార్యదర్శి ఐ. సూరిబాబు, కోశాధికారి జీవీ భీమేశ్వరరావు, జి.వి రమణ తదితరులు లక్ష్మణమూర్తి సేవలను కొనియాడారు. తొలుత లక్ష్మణమూర్తి విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్, టైలర్ల యూనియన్, తదితర నాయకులు పాల్గొన్నారు.



రావులపాలెం పోలీస్‌స్టేషన్ వద్ద పోలీసు అమరవీరుల దినోత్సవ దృశ్యం



కొత్తపేటలో పోలీస్ అమరవీరులకు నివాళులర్పిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

పోలీసుల త్యాగాలు మరవలేనివి

రావులపాలెం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రావులపాలెం పోలీస్‌స్టేషన్ వద్ద పట్టణ సీఐ శేఖర్‌బాబు ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీని నిర్వహించారు. అనంతరం జరిగిన సమావేశంలో సీఐ శేఖర్‌బాబు మాట్లాడుతూ పోలీసుల త్యాగాలను ప్రజలకు తెలిపారు.

అమరవీరులకు నివాళి

కొత్తపేట, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి: పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వీకేవీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో అమరవీరుల చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు అశువులు బాసిన పోలీస్ అమరవీరులకు జోహార్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీ కె.కనకరాజు, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఆలమూరు (ఆంధ్రజ్యోతి): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఆలమూరులో పోలీస్ అమరవీరులకు నివాళులర్పించారు. ఆలమూరు పోలీస్‌స్టేషన్ వద్ద ఎస్ఐ జి.నరేష్ అధ్వర్యంలో సిబ్బందితో కలసి అమరవీరులకు నివాళులర్పించి వారి త్యాగాలను కొనియాడారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వారి త్యాగాలు చరిత్రలో చిరస్థాయిగా నిలుస్తాయన్నారు. కార్యక్రమంలో పలువురు పోలీసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఆలమూరులో అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో అమరవీరులకు నివాళులర్పిస్తున్న ఎస్ఐ నరేష్